# మనం
## ఖమ్మం
## భద్రాద్రి కొత్తగూడెం



www.manamepaper.com బుధవారం | 05 | ఆగష్టు | 2026 | పేజీలు :18


## దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు

– తెలంగాణకు
రూ. 9.19 కోట్లు విడుదల
– ఎంపీ రఘురాం రెడ్డి
ప్రశ్నకు కేంద్ర సామాజిక
న్యాయ మంత్రి
బీఎల్.వర్మ సమాధానం



వివరాలు మెయిన్‌లో..

# గడువులోగా...ఆలయ పునర్నిర్మాణ పనులు

– ఆలయ ప్రాచీనతకు భంగం కలగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలి
– భక్తులకు మెరుగైన దర్శన, మౌలిక వసతులు కల్పించేలా పనులు వేగవంతం చేయాలి
– కలెక్టర్ అంకిత్
– పనులు పరిశీలన



వివరాలు 10లో..

## భద్రాద్రి జిల్లాలో ప్రతి ఎకరాకు సీతారామ జలాలు అందించాలి

– ఆగష్టు 6 నుంచి 'ప్రజాచైతన్య యాత్రలు'
– మీడియా సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా

వివరాలు 7లో.

## కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ నిరుద్యోగుల పాలిట మరణ శాసనం



బీఆర్ఎస్ నాయకులు
ఏనుగుల రాకేష్ రెడ్డి ధ్వజం
వేణును ఫోన్లో
పరామర్శించిన కేటీఆర్

17 లో

## తీవ్రరూపం దాల్చుతున్న నిరుద్యోగం

– జాబ్ క్యాలెండర్
విడుదల చేయాలి
రాష్ట్ర ప్రభుత్వానికి
45 రోజుల గడువు
ఇస్తున్నాం...

వివరాలు 17లో..




– వేణు కుమార్‌ను పరామర్శించిన బీజేపీ నేతలు

మనం

ఖమ్మం

ఖమ్మం కార్పొరేషన్- ఖమ్మం అర్బన్ - రఘునాధపాలెం

# మందా సత్యానందంకు ప్రజానాట్యమండలి నివాళి

**ఖమ్మం, ఆగస్టు 4 (మనం న్యూస్) :** సోమవారం రాత్రి రావినూతల వేబ్రిడ్జ్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రమాద వశాత్తు మరణించిన బోనకల్ విజన్ ఆంధ్ర రిపోర్టర్ ప్రజానాట్యమండలి బోనకల్ మండల కమిటీ సభ్యులు మందా సత్యానందం కు ప్రజానాట్యమండలి ఖమ్మం జిల్లా కమిటీ తీవ్ర సంతాపాన్ని తెలిపింది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలియజేస్తున్నామని సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నామ లక్ష్మీనారాయణ, వేముల సదానంద్ ఒక ప్రకటనలో లో తెలియజేసారు. సత్యానందం మరణం చాలా బాధాకరం అనీ కళారంగానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ప్రజానాట్యమండలి ఖమ్మం జిల్లా కమిటీ వైపు నుండి జోహార్లు అర్పిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

# అనుమతులు లేకుండా ఎగ్జిబిషన్ నిర్వహణ

## యాజమాన్యంపై కేసు నమోదు : ఇన్స్పెక్టర్ బాలకృష్ణ

**ఖమ్మం, ఆగస్ట్ 4(మనం న్యూస్):** ఖమ్మం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్స్ లో ప్రదర్శన చెల్లుబాటు అయ్యే ఎలాంటి అనుమతి లేకుండా "ఎస్.కె. ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్" పేరుతో ప్రదర్శనను నిర్వహిస్తున్న నిర్వాహకుడు గరిమెల్ల జానకి రామయ్య పై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. సెక్టార్ డ్యూటీ పెట్రోలింగ్ చేస్తున్న ఎస్ఐ పి. వెంకటేష్ కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పెవిలియన్ గ్రౌండ్‌లో గరిమెల్ల జానకి రామయ్య అనే వ్యక్తి, సంబంధిత అధికారుల నుండి అనుమతి ఉందని తప్పుడు ప్రచారం చేస్తూ... "ఎస్.కె. ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్" పేరుతో ఒక ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసి, ప్రదర్శన నిలిపివేసినట్లు తెలిపారు.

# బాలుర సంక్షేమ హాస్టళ్లకు కాంపౌండ్ వాల్ నిర్మించాలి

## యుయస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హాస్టల్ ముందు ధర్నా

**ఖమ్మం, ఆగస్ట్ 4(మనం న్యూస్):** ఖమ్మం నగరం ఎన్ఎస్పీ క్యాంప్ ప్రాంగణంలో ఉన్న మూడు ప్రభుత్వ బాలుర సంక్షేమ హాస్టళ్లకు వెంటనే రక్షణగా పహారీ గోడలు (కాంపౌండ్ వాల్స్) నిర్మించాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూ ఎస్ఎఫ్ ఐ) నాయకుడు బొట్ల సాగర్ డిమాండ్ చేశారు. హాస్టళ్ల ప్రాంగణాన్ని మంగళవారం సందర్శించి ధర్నా చేశారు. అనంతరం బొట్ల సాగర్ మాట్లాడుతూ... ఎన్ఎస్పీ క్యాంప్‌లో వెనుకబడిన, పేద విద్యార్థులు చదువుకునే మూడు బాలుర హాస్టళ్లు పక్కపక్కనే ఉన్నప్పటికీ, వాటికి సరైన రక్షణ గోడలు లేకపోవడం శోచనీయమన్నారు. కాంపౌండ్ వాల్స్ లేకపోవడం వల్ల హాస్టల్ ప్రాంగణంలోకి అపరిచిత వ్యక్తులు రావడం విద్యార్థులు బయటకి వెళ్లే అవకాశాలు ఉండడం పాములు వచ్చే అవకాశాలు ఉన్నందున విద్యార్థుల భద్రతకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో విద్యార్థుల భద్రత ప్రశ్నర్థకంగా మారిందని, హాస్టల్ పరిసరాలు అపరిశుభ్రంగా తయారై వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి, నిధులు మంజూరు చేసి మూడు హాస్టళ్లకు కలిపి తక్షణమే పహారీ గోడలను నిర్మించాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూ ఎస్ఎఫ్ ఐ సంఘం నాయకులు, నిఖిల్,అస్లాం, అఫ్రోజ్,మనోజ్, చిన్ను,సురేష్ తదితరులు పాల్గొన్నారు.




# పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

## కార్మికుల హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు

## మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డి

**ఖమ్మం, ఆగస్ట్ 4(మనం న్యూస్):** సమస్యల పరిష్కారం కోసం పోరాటాలే శరణ్యమని కార్మిక హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు నిర్వహించాలని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్రెడ్డి తెలిపారు. తెలంగాణ లో జిహెచ్ఎంసి, మున్సిపల్ కార్పోరేషన్లలో దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్, పారిశుధ్య కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఖమ్మంజిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) సర్వసభ్య సమావేశం మంగళవారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో జిల్లా అధ్యక్షులు బుర్రి ఉపేంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జైపాల్రెడ్డి మాట్లాడుతూ నగరాలు, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న పారిశుధ్య, డ్రైవర్, ఇతర అవుట్ సోర్సింగ్ సిబ్బందికి శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదని తెలిపారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీలు నీటి ముటలుగానే మిగిలిపోయాయన్నారు. క్షేత్రస్థాయిలో రక్షణ పరికరాలు, సరైన వైద్య సదుపాయాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులను తక్షణమే రెగ్యులరైజ్ చేయడంతో పాటు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమానవేతనాన్ని అమలు చేసి నెలకు రూ. 26వేలు చెల్లించాలన్నారు. కార్మికుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని క్రమం తప్పకుండా




హజార్డ్ అలవెన్స్ చెల్లించడంతో పాటు ఇఎస్ఐ, పిఎఫ్ సదుపాయాలను కల్పించాలన్నారు. ఏఐటియుసి జాతీయ సమితి సభ్యులు బిజి క్లైమెంట్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు విధి నిర్వహణలో మరణించిన, శాశ్వత వికలాంగుడైన కార్మిక కుటుంబాలకు రూ. 10 లక్షల పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. కార్మికులకు మాస్కు, గ్లాజులు, బూట్లు, సబ్బులు, నూనెలు క్రమం తప్పకుండా ప్రతి నెల అందించాలన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై త్వరలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ కార్మికులంతా ఐక్యంగా ఉద్యమాల్లో భాగస్వామం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు పేరబోయిన మోహన్రావు, జిల్లా సమితి సభ్యులు బోడా వీరన్న, సతీష్రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరికంటి కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ రాయపూడి శ్రీను, ఉపాధ్యక్షులు సయ్యద్ వజీరిమియా, ఇటికాల వెంకటేశ్వరరావు, కార్యదర్శులు అలవాల రాహేలు, తాటి నాగేంద్రబాబు పాల్గొన్నారు.

# ప్రజా చైతన్యమే లక్ష్యంగా కళారూపాలు : జమ్ముల

**ఖమ్మం, ఆగస్ట్ 4(మనం న్యూస్):** ప్రజా చైతన్యమే లక్ష్యంగా కళారూపాలు ఉండాలని కళలు మనో వికాసానికి, సమాజశ్రేయస్సుకు దోహదపడాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి తెలిపారు. ఇటీవల కాలంలో కళ వ్యాపార వస్తువుగా మారిందని అబద్ద ప్రచారాలకు కళారూపాలు వేదిక కావడం అత్యంత బాధాకరమన్నారు. తెలంగాణ ప్రజానాట్య మండలి ఖమ్మం జిల్లా సమితి సమావేశం మంగళవారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో జరిగింది. జిల్లా అధ్యక్షులు జిఎస్ఆర్ ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జితేందర్రెడ్డి మాట్లాడుతూ ప్రజానాట్య మండలి అనేక దశాబ్దాలుగా ప్రజా అభ్యుదయం లక్ష్యంగా అనేక కళారూపాలను ప్రదర్శించిందన్నారు. ప్రస్తుతం పాలకులు ప్రజలను విస్మరించి పాలన చేయడంతో పాటు సంక్షేమ కార్యక్రమాల అమలులో సైతం వివక్ష ప్రదర్శిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఒక పక్క మతం, మరో పక్క ఆర్థిక అంతరాలు సమాజ అభివృద్ధికి పెను సవాలుగా మారుతున్న నేపథ్యంలో ప్రజానాట్య మండలి నూతన జవసత్వాలతో ముందుకు రావాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ప్రపంచీకరణ ఫలితంగా ప్రజా



కళలు సైతం అంగడి వస్తువులుగా మారాయని ఆయన తెలిపారు. సిపిఐ నిర్వహిస్తున్న ప్రచార చైతన్య యాత్రలో కళారూపాలను ప్రదర్శిస్తూ ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ఈనెల ఆరు నుంచి 14 వరకు ప్రజానాట్య మండలి కళాకారులు ప్రదర్శనలు ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ప్రజానాట్య మండలి జిల్లా కన్వీనర్ ఏనుగు వెంకటేశ్వరరావు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఆరెంపుల సతీష్, కళాకారులు పల్లెసుద్దుల శ్రీను, మోహన్రావు, చందర్రావు, గణపారపు లక్ష్మి నారాయణ, కొచ్చెర్ల గురవయ్య, పుల్లయ్య, రామ్మూర్తి, పెద్దపాక రాము పాల్గొన్నారు.

# ఖానాపురంలో కొలువు దిరిన శితలా భవానీలు

**ఖమ్మం, ఆగస్టు 4(మనం న్యూస్):** ఖమ్మం నగరంలోని యూపిఎచ్ కాలనీ, ఖానాపూరం నందు అత్యంత భక్తి శ్రద్దలతో శితల భవాని అమ్మవార్లని కోలుచుకున్నారు. శీతల భవాని బంజారా/లంబాడి సమాజం ఆరాధించే ప్రధాన దేవతల్లో ఒకరు. బంజారా సంప్రదాయంలోని సాతీ భవానీలు--- ఏడు దేవతా రూపాల్లో శీతల భవాని ఒక రూపంగా భావిస్తారు. శీతల భవాని పండుగను సాధారణంగా ప్రకృతి,వర్షాలు మరియు పంటల సమృద్ధి కోసం గ్రామ ప్రజలకు ఆరోగ్యం,శాంతి కలగాలని పశుసంపద అభివృద్ధి కోసం,కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవార్లని కొలుస్తారు. పూజా సంప్రదాయాలు తండా వెలుపల ఉన్న శీతల భవాని స్థలానికి కుటుంబాలు చేరుకునీ నైవేద్యాలను సమర్పిస్తారు.బంజారా కుటుంబాలు మొత్తం బంధుమిత్రుల సమేతంగా పాల్గొనడం ఈ పండుగలో ముఖ్యమైన ఆచారంగా కనిపిస్తుంది. శీతల భవాని పండుగ కేవలం దేవతా పూజ మాత్రమే కాదు ప్రకృతి,పశు సంపద,ఆరోగ్యం, కుటుంబం మరియు సమాజ ఐక్యతను గౌరవించే



బంజారా జీవన సంస్కృతికి ప్రతీక గా నిలుస్తుంది. శీతల భవాని అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆరోగ్యం,వ్యాపారం,పంటల్లో సమృద్ధి,కుటుంబాల్లో శాంతి నెలకొనాలనీ అమ్మవార్లని పూజిస్తారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం నగరం నుండే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాల వారు కూడా వచ్చి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు, ఆలయ ప్రాంగణం లో మహిళలు,ఆడపిల్లలు అమ్మవార్ల పాటలకు నృత్యాలు చేస్తూ అలరించారు.

# గిరిజన సర్పంచ్ ఆర్మీ రవికి నరేష్ రెడ్డి నుంచి ప్రాణహాని

## బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భాషబోయిన వీరన్న



**తిరుమలాయపాలెం ఆగస్టు 4 (మనం న్యూస్)** రామ సహాయం నరేష్ రెడ్డి, అధికార పార్టీ నాయకుల ద్వారా వాగు తండా గ్రామ సర్పంచ్ భాను రవి (ఆర్మీ రవి ) కి ప్రాణహాని ఉందని మంగళవారం తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్లో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఆధ్వర్యంలో ఫిర్యాదు ఇవ్వడం జరిగింది: పిఎసిఎస్ చైర్మన్ చావా వేణు తెలిపారు ఆగస్టు 3 న సోమవారం సాయంత్రం తిరుమలయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 40 మంది అధికార కాంగ్రెస్ గుండాలు మేము నరేష్ రెడ్డి మనుషులం అని చెప్పుకుంటూ నిన్ను కచ్చితంగా చంపేస్తాం మాకు నరేష్ రెడ్డి అన్ని చూసుకుంటారు అని ఆర్మీ రవి ని బెదిరిస్తున్నార ని నువ్వు మానాయకులపై సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు పెట్టవద్దు అలగే ప్రజా సమస్యల గురించి పోరాడవద్దని అలా చేస్తే నిన్ను లారీ తో గుద్ది చంపేస్తామని బెదిరిస్తున్నార ని మేము అధికారంలో ఉన్నాం మాకు పెద్దల అండదండ ఉంది మమ్మల్ని ఎవరు ఏం చేయలేరని బాహాటంగానే బెదిరిస్తున్నారు. గతంలో కూడా ఆర్మీ రవిని చంపాలని పథకం రచించగా తృటిలో తప్పించుకుని ప్రాణాలతో బయటపడ్డారు. తిరుమలాయపాలెం మండలంలో ఎప్పుడూ ఇలా హత్య రాజకీయాలకు చోటు లేదు కానీ ఈ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే శాంతిభద్రతలు అదుభ్తప్పి గుండాలు, రౌడీలు హత్యలు ధోపిడీలతో ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఒక గిరిజన యువకుడు సర్పంచ్ అయితే అధికార పార్టీ నాయకులకు మింగుడు పడడం లేదు ఆర్మీ రవి ప్రతి రోజు ప్రజా సమస్యలపై పోరాడుతుంటే ప్రజాస్వామ్యబద్ధంగా ఆయన అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పండి అంతేగాని ఇలా బెదిరింపు, హత్య రాజకీయాలను తిరుమలాయపాలెం మండలంలో చేస్తే మాత్రం బిఆర్ఎస్ పార్టీ చేతులు కట్టుకొని కూర్చో బోమని పోలీసువారు వెంటనే నిన్న తిరుమలయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని సీసీ కెమెరాల ఫుటేజ్ తీసుకొని ఆర్మీ రవిని బెదిరించిన వారిని వెంటనే అరెస్టు చేసి వారికి తగిన శిక్ష వేయాలని బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుంది. అలాగే ఆర్మీ రవికి పార్టీ అండగా ఉంటుందని, మా పార్టీ కార్యకర్తలు జోలికి వస్తే మేము ఊరుకోమని ప్రజాస్వామ్యబద్ధంగా అధికార పార్టీ నాయకులకు తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. తిరుమలాయపాలెం మండలంలో జరుగుతున్న అరాచకాల పైన త్వరలో కార్యచరణ ఉంటది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ బోడా మంచ నాయక్, ఉప సర్పంచ్ షేక్ చందు, పోలేపొంగు రామచంద్రు, గంట కృష్ణ పోలే పొంగు వెంకటేశ్వర్లు, సామ వెంకటరెడ్డి, సామాలింగారెడ్డి, సామా బసవరెడ్డి, బానోతు రవి, బానోతు మోహన్ జీనక రమేష్, ఎల్లయ్య బానోతు వినోద్ తదితరులు పాల్గొన్నారు

# పొగలోనే పోషకాహారం...
# ఒక గరిటె రాగిజావతో వేల చిరునవ్వులు!

### నాగమణి అక్క... నాకు కూడా రాగిజావ పొయ్యండి అంటూ చిన్నారుల అమాయక పిలుపు

### జడ్పీహెచ్ఎస్, యూపీఎస్ ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వ పోషకాహార కార్యక్రమం విజయవంతం

### పొగ, సెగ, వర్షాన్ని లెక్కచేయకుండా వంట సిబ్బంది అంకితం



**ఖమ్మం రూరల్, ఆగస్టు 4(మనం న్యూస్)** ఒకవైపు కట్టెల పొయ్యి నుంచి ఎగిసిపడుతున్న దట్టమైన పొగ... మరోవైపు చేతుల్లో గిన్నెలు పట్టుకుని "నాగమణి అక్క... నాకు కూడా రాగిజావ పొయ్యండి..." అంటూ అమాయకంగా వరుసలో నిలబడిన చిన్నారులు... ఖమ్మం రూరల్ మండలంలోని ఎదులాపురం పాఠశాలలోని జడ్పీహెచ్ఎస్, యూపిపిఎస్ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిరోజూ కనిపించే ఈ దృశ్యం కేవలం రాగిజావ పంపిణీ మాత్రమే కాదు. ఇది రాష్ట్ర ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్యంపై చూపుతున్న శ్రద్ధకు, అలాగే పొగను భరిస్తూ ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్న వంట సిబ్బంది సేవాభావానికి ప్రతీకగా నిలుస్తోంది. ప్రధాన కథనం చేతుల్లో చిన్న చిన్న స్టీల్ గిన్నెలు... ముఖాల్లో అమాయకమైన చిరునవ్వులు... తమ వంతు కోసం క్రమశిక్షణగా ఎదురుచూస్తున్న చిన్నారుల మధ్య నుంచి ఒక్కసారిగా వినిపించిన మాట... "నాగమణి అక్క... నాకు కూడా రాగిజావ పొయ్యండి...!" ఆ పిలుపు విన్న నాగమణి అక్క చిరునవ్వుతో గరిటె నిండా రాగిజావను వడ్డిస్తూ, "అందరికీ వస్తుంది బంగారం... ఒక్కొక్కరుగా రండి" అంటూ ప్రేమగా పలకరించింది. ఆ దృశ్యం అక్కడున్న ప్రతి ఒక్కరినీ హత్తుకుంది. ఒకవైపు చిన్నారుల ఆనందం... మరోవైపు వారికోసం అంకితభావంతో పనిచేస్తున్న వంట సిబ్బంది సేవా తపన స్పష్టంగా కనిపించింది. రాష్ట్ర ప్రభుత్వం చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించడం, రక్తహీనతను తగ్గించడం, ఆరోగ్యవంతమైన భావితరాన్ని తీర్చిదిద్దడం లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఖమ్మం రూరల్ మండలంలోని జడ్పీహెచ్ఎస్, యూపీపిఎస్ పాఠశాలల్లో ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతూ చిన్నారులకు పోషకాహార భరోసా కల్పిస్తోంది. రాగిలో ఉండే కాల్షియం, ఐరన్, ప్రోటీన్లు, ఫైబర్, ఖనిజలవణాలు చిన్నారుల శారీరక ఎదుగుదలకు, ఎముకల బలానికి, రక్తహీనత నివారణకు, రోగనిరోధక శక్తి పెంపునకు ఎంతో ఉపయోగపడుతున్నాయని ఉపాధ్యాయులు తెలిపారు. అందుకే ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో కొనసాగిస్తోందన్నారు. పొగల్లోనే తయారవుతున్న పోషకాహారం అయితే పిల్లల చేతుల్లోకి చేరే ప్రతి గరిటె రాగిజావ వెనుక కనిపించని కష్టం కూడా ఉంది. ప్రతిరోజూ తెల్లవారుజామునే వంట సిబ్బంది పాఠశాలకు చేరుకుని కట్టెలను సిద్ధం చేసి పొయ్యి వెలిగిస్తారు. పెద్ద పాత్రల్లో నీటిని మరిగించి, నిర్ణీత ప్రమాణాలతో రాగి పిండిని కలుపుతూ గంటల తరబడి శ్రమించి రాగిజావను సిద్ధం చేస్తారు. దట్టమైన పొగ, వేడి సెగలు, కళ్లలో మంట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురైనా పిల్లలకు సమయానికి పోషకాహారం అందించాలనే బాధ్యతతో మహిళా వంట కార్మికులు తమ విధులను నిర్వర్తిస్తున్నారు. వర్షం వస్తే మరింత దయనీయ పరిస్థితి వంటశాలకు తగిన సౌకర్యాలు లేకపోవడంతో వర్షాకాలంలో పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోంది. కట్టెలు తడవడం, పొయ్యి సరిగా మండకపోవడం, పొగతో వంటశాల మొత్తం నిండిపోవడం, వంట చేసే ప్రదేశంలోకి వర్షపు నీరు చేరడం వంటి సమస్యల మధ్య కూడా రాగిజావ తయారీ కొనసాగుతోంది.

అయినా చిన్నారుల ఆరోగ్యం కోసం వంట సిబ్బంది తమ కష్టాలను పక్కన పెట్టి సేవలు అందిస్తున్నారు. "పిల్లల చిరునవ్వే మా శ్రమకు ప్రతిఫలం"

వంట సిబ్బంది, "పిల్లలు ఆనందంగా రాగిజావ తాగడం చూస్తే మా కష్టం మరిచిపోతాం. కానీ సరైన వంటగది, గ్యాస్ సదుపాయం, పొగ బయటకు వెళ్లే చిమ్నీ వంటి సౌకర్యాలు కల్పిస్తే ఇంకా పరిశుభ్రంగా, వేగంగా వంట చేయగలుగుతాం" అని తెలిపారు.

తల్లిదండ్రుల ప్రశంసలు

పలువురు తల్లిదండ్రుల "మా ఇళ్లలో ప్రతిరోజూ రాగిజావ తయారు చేయడం సాధ్యం కాదు. కానీ ప్రభుత్వ పాఠశాలలో మా పిల్లలకు నాణ్యమైన పోషకాహారం ఉచితంగా అందించడం చాలా సంతోషంగా ఉంది. ఇది పిల్లల ఆరోగ్యాన్ని కాపాడే గొప్ప కార్యక్రమం" అని అన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి

ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ మంచి కార్యక్రమానికి అనుగుణంగా జడ్పీహెచ్ఎస్, యూపీఎస్ పాఠశాలల్లో ఆధునిక వంటశాలలు, ఎల్పీజీ గ్యాస్, పొగరహిత పొయ్యిలు, ఎగ్జాస్ట్ చిమ్నీలు, తాగునీటి సౌకర్యం, నిల్వ గదులు, వర్షం రాకుండా రక్షణ కల్పించే షెడ్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

మనం



# పాలేరు

కూసుమంచి - నేలకొండపల్లి- ఖమ్మం రూరల్ - తిరుమలాయపాలెం

# మల్లేపల్లిలో భూ భారతి రి సర్వేపై రైతులకు అవగాహన కల్పించిన అధికారులు



**కూసుమంచి, ఆగస్టు 4 (మనం న్యూస్) :** రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు మల్లేపల్లి గ్రామంలో నిర్వహించిన భూ భారతి రి సర్వే పై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూసుమంచి తాసిల్దార్ సైదులు మాట్లాడుతూ. రీ సర్వే పక్రియ భూ రికార్డుల సవరణ హద్దుల నిర్ధారణ రైతులు పాటించవలసిన విధివిధానాల గురించి వివరించారు, రీ సర్వే అయ్యేంతవరకు రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు, అనేక సంవత్సరాల నుండి ఉన్నటువంటి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం అని అన్నారు, భూమి మీద ఉండి వ్యవసాయం చేస్తున్న రైతులకు నూతన టెక్నాలజీ పద్ధతిలో సర్వే చేయనున్నట్లు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తెల్ల మేకల భవిత మాట్లాడుతూ, గత నిజాం కాలము నుండి ఉన్నటువంటి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుందని తెలియజేశారు, తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గత ఎన్నో సంవత్సరాల నుండి ఉన్నటువంటి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రయత్నం చేస్తున్న మంత్రికి అభినందనలు తెలియజేశారు, గ్రామ ఉపసర్పంచ్ తోటకూరి కృష్ణారావు, మరియు వార్డు సభ్యులు,ఆర్ ఐ రాములు, సర్వేర్ వెంకటేశ్వర్లు, జిపిఓ గ్రామ రైతు సోదరులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# రాజారం గ్రామంలో సర్పంచ్ నిర్లక్ష్యంతో నీట మునిగిన ఇండ్లు

## 8వ వార్డు సభ్యులు బాణాల వెంకట్ రెడ్డి



**తిరుమలాయపాలెం, ఆగస్టు 4 (మనం న్యూస్):** మండలం లోని రాజారం గ్రామపంచాయతీ లో ఎనిమిదో వార్డులో రాజారం గ్రామపంచాయతీ సర్పంచ్ నిర్లక్ష్యంతో ఇండ్లు నీట మునిగాయని కొత్త రోడ్డు పోసినప్పుడు పాత, కొత్త రోడ్డు కి లింకు కలపమని ఎన్ని సార్లు మొత్తుకున్నా వినకపోవడంతో నేడు వర్షాలకు ఇండ్లలోకి నీరు వచ్చి బురద మయంగా మారిందని ఎనిమిదవ వార్డు సభ్యులు బాణాల వెంకటరెడ్డి ఆరోపించారు గ్రామంలో అన్ని పాత కొత్త రోడ్లను కలిపి కాలనీలో కలపకపోవడం ముఖ్యంగా వారు ఓడిపోయిన వార్డులు, వారికి ఓట్లు తక్కువ వేశారని ప్రతీకారం చర్య తీసుకుంటున్నారనేది స్పష్టంగా అర్థమవుతుందని ఆయన తెలిపారు ఈ విషయాన్ని సంబంధిత వార్డు సభ్యులు పాలకవర్గ సమావేశంలో మూడు సార్లు ప్రస్తావించగా నెలరోజుల్లో వేస్తామని హామీ ఇచ్చి ఆరునెలలైనా సర్పంచ్ పట్టించుకోకపోవడం దేనికి సంకేతం? ఈ కాలనీల్లో నివసించే వాళ్ళు వారికి ఓటు వేయలేదని మొదటి నుంచి కాలనీ వాసులపై కక్ష్య సాధింపు చర్యలకు సర్పంచ్ పాల్పడడం చాలా బాధాకరమన్నారు కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఇదేనా మీరు చెప్పిన జన రంజక పాలన. ఎందుకు కాలనీ సమస్యలంటే మీకు పట్టవని వారంరోజుల్లో ఈ సమస్యను పరిష్కరించాలి లేకుంటే కాలనీవసులమందరం ప్రత్యక్ష కార్యాచరణ దిగి మా సమస్యను పరిష్కరించే వరకు ఈ పాలకవర్గాన్ని వదిలిపెట్టం అని ఆయన అన్నారు.



మనం
జనం కోసం అక్షర యజ్ఞం



# వైరా

వైరా - కారేపల్లి - కొణిజర్ల - ఏన్కూరు - జూలూరుపాడు



## ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంలోనే పోలీస్ సేవలు .. సీపీ సునీల్ దత్

**కారేపల్లి, ఆగస్టు 04 (మనం న్యూస్) :** ఫ్రెండ్లీ పోలీస్ సింగ్ విధానంలోనే పోలీసు సేవలు అందిస్తున్నట్లు ఖమ్మం కమిషనర్ ఆఫ్ పోలీస్ సునీల్ దత్ తెలిపారు.కారేపల్లి పోలీస్ స్టేషన్ ను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను,రికార్డులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంలో పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించిన బాధితుల పక్షాన సేవలందించడం జరుగుతుందని అన్నారు.ఏవైనా సమస్యలు ఎదురైతే పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు.సీపీ సునీల్ దత్ వెంట ఏసిపి తిరుపతి రెడ్డి,సిఐ నునావత్ సాగర్,కారేపల్లి ఎస్సై బైరు గోపి, కామేపల్లి ఎస్సై శ్రీకాంత్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీటీ రోడ్డు మంజూరు చేయాలి

**కొణిజర్ల, ఆగస్టు 04 (మనం న్యూస్)** పెద్దగోపతి గ్రామపంచాయతీ పరిధిలోని బొట్లకుంట నుంచి గోపవరం గ్రామానికి బీటీ రోడ్డును మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టాలని కొనిజర్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊటుకూరి రంజిత్ వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బొట్లకుంట రామాలయం నుంచి గోపవరం గ్రామానికి వెళ్లే



రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రైతుల సమస్యను దృష్టిలో ఉంచుకుని బీటీ రోడ్డును త్వరితగతిన మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.అదేవిధంగా బొట్లకుంట గ్రామంలోని ఎస్సీ కాలనీలో విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నందున అక్కడ కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుని అధికారులతో మాట్లాడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు ఊటుకూరి రంజిత్ తెలిపారు.

## మాస్టర్ ట్రైనర్‌గా తమ్మిశెట్టి ఎంపిక

### హిస్టరీ సబ్జెక్టులో సేవలకు గాను జూనియర్ లెక్చరర్ తమ్మిశెట్టి శ్రీనివాస్ కు అరుదైన గౌరవం

**కారేపల్లి, ఆగస్టు 04 (మనం న్యూస్) :** ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చరిత్ర పుస్తకంపై రాష్ట్రస్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల హిస్టరీ లెక్చరర్ తమ్మిశెట్టి శ్రీనివాస్ ను మాస్టర్ ట్రైనర్ గా ఇంటర్మీడియట్ బోర్డు ఎంపిక చేసింది.హైదరాబాద్ లోని ఇంటర్మీడియట్ బోర్డు లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇవ్వనున్నారు.మారిన చరిత్ర పుస్తకంపై రాష్ట్రస్థాయిలో హిస్టరీ లెక్చరర్లకు ట్రైనింగ్ ఇచ్చేందుకు శ్రీనివాస్ ను ఎంపిక చేయడం పట్ల కారేపల్లి కళాశాల ప్రిన్సిపల్ విజయ కుమారి,అధ్యాపక బృందం, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



# ఉద్యోగం కోసం భూమిని త్యాగం చేశాం

### రెవెన్యూ శాఖ అనుమతితోనే వీఆర్ఏ నియామకం

### మాపై వస్తున్న తప్పుడు ఆరోపణల్లో వాస్తవం లేదు

**కారేపల్లి, ఆగస్టు 04 (మనం న్యూస్) :** భూమిని త్యాగం చేశాకే ఉద్యోగం లభించిందని, రెవెన్యూ శాఖ అనుమతితోనే వీఆర్ఏ ఉద్యోగ నియామకం జరిగిందని కల్లోజి భాస్కర్,కల్లోజి సుదర్శన్ తెలిపారు.సింగరేణి మండల పరిధిలోని రేలకాయలపల్లి గ్రామ రెవెన్యూ సహాయకుడు (వీఆర్ఏ) నియామకంపై వస్తున్న ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని తెలిపారు.ఈ మేరకు మంగళవారం కారేపల్లిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ తాత ద్వారా గ్రామ రెవెన్యూ సహాయకుడు (వీఆర్ఏ) తనకు ఉద్యోగం సంక్రమించిందని అన్నారు. 2023లో ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సహాయకులను (వీఆర్ఏలు) క్రమబద్ధీకరిస్తూ ఒకరికి మాత్రమే అవకాశం కల్పించడంతో,గ్రామ



పెద్దలు, అప్పటి సర్పంచ్ సమక్షంలో పరస్పర అంగీకారంతోనే ఒప్పందం కుదిరిందన్నారు. ఒప్పందం ప్రకారం కల్లోజి శ్రీనివాస్ పేరున ఉన్న సుమారు రూ.15 లక్షల విలువైన 1 ఎకరం 20 గుంటల వ్యవసాయ భూమిని కల్లోజి ప్రభాకర్ పేరున రిజిస్ట్రేషన్ కూడా చేసినట్లు తెలిపారు.ప్రతిఫలంగా వారసత్వంగా వస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుడు (వీఆర్ఏ) ఉద్యోగాన్ని కల్లోజి శ్రీనివాస్‌కు ఇవ్వాలని ఇరు కుటుంబాలు ఏకగ్రీవంగా నిర్ణయించి ఒప్పంద పత్రంపై సంతకాలు కూడా చేసినట్లు వివరించారు.ఈ వ్యవహారానికి సంబంధించిన ఒప్పంద పత్రాలు,భూ రిజిస్ట్రేషన్ సహా అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని,కొంతమంది వాస్తవాలను వక్రీకరించి ప్రచారం చేయడం బాధను కలిగించిందన్నారు.గతంలో పనిచేసిన ఓ తహసిల్దార్ ద్వారా గుర్తింపు కార్డును కూడా పొందినట్లు తెలిపారు.

# గ్రంథాలయాల సమస్యలను పరిష్కరిస్తా

### - జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా

**కామేపల్లి, ఆగస్టు 4 (మనం న్యూస్):** జిల్లాలోని గ్రంథాలయాలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత అధికారులతో మాట్లాడి వాటికి త్వరితగతిన శాశ్వత పరిష్కారం చూపుతానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా స్పష్టం చేశారు. మంగళవారం ఆయన కామేపల్లి మండల పరిధిలోని పండితాపురం, కామేపల్లి గ్రామాల్లో ఉన్న గ్రంథాలయాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల నిర్వహణ, పుస్తకాల లభ్యత, పాఠకులకు అందుతున్న సేవలతో పాటు అక్కడ ఎదురవుతున్న పలు సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థలో పండితాపురం గ్రంథాలయం పండితాపురం గ్రంథాలయ సందర్శన సమయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు చైర్మన్‌కు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రస్తుతం గ్రంథాలయం కొనసాగుతున్న భవనం పురాతన కాలం నాటిదని, తీవ్రంగా శిథిలావస్థకు చేరుకొని ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదకర స్థితిలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం విద్యార్థులు, పాఠకులు వచ్చే ఈ భవనంలో ప్రమాదాలు జరగకముందే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలోకి తాత్కాలిక మార్పుకు విజ్ఞప్తి నూతన భవన నిర్మాణం పూర్తయ్యే వరకు పాఠకులు, విద్యార్థుల సౌకర్యార్థం గ్రంథాలయ నిర్వహణను స్థానిక ప్రాథమిక పాఠశాల భవనంలోకి తాత్కాలికంగా మార్చేలా అనుమతులు మంజూరు చేయాలని కోరారు.



చైర్మన్‌కు వినతిపత్రం ఇచ్చిన కొమ్మినేపల్లి గ్రామ సర్పంచ్ అనురాధ,

శాశ్వత పరిష్కారానికి కృషి: చైర్మన్ ఖాదర్ బాబా వినతిపత్రం స్వీకరించిన అనంతరం చైర్మన్ ఖాదర్ బాబా మాట్లాడుతూ... పండితాపురం గ్రంథాలయ భవన పరిస్థితిని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. పాఠకుల భద్రత దృష్ట్యా తాత్కాలికంగా పాఠశాల భవనంలోకి మార్చే అంశాన్ని పరిశీలించడంతో పాటు, నూతన భవన ఏర్పాటుకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అదేవిధంగా కామేపల్లి గ్రంథాలయంలో ఉన్న మౌలిక వసతుల కొరతను కూడా త్వరలోనే నివారించి, గ్రంథాలయాలను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ గ్రంథపాలకుడు ఎం. నవీన్ కుమార్, స్థానిక గ్రామస్తులు, యువకులు, విద్యార్థులు, పాఠకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలపై అధిక పన్నుల భారం మోపితే పోరాటం చేస్తాం

### జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు

**వైరా, ఆగస్టు 04 (మనం న్యూస్):** వైరా మున్సిపాలిటీలోని ప్రజలపై అధిక పన్నుల భారం మోపితే బీఆర్ ఎస్ పోరాటం చేస్తుందని ఆపార్టీ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, టౌన్ ప్రెసిడెంట్ అప్పం సురేష్ అన్నారు.గత కొంతకాలంగా వసూలు చేస్తున్న మంచినీటి పన్నుల బకాయిలు ఎలాంటి తీర్మానం లేకుండా సిబ్బంది ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. మాట్లాడుతూ మున్సిపాలిటీ ఏర్పడి సుమారు 8 సంవత్సరాల కాలంలో టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మంచినీటి పనులు వసూళ్లు చేయలేదని, కానీ వైరా మున్సిపాలిటీ పరిధిలో సిబ్బంది మూడు సంవత్సరాల బిల్లును ఒకేసారి వసూలు చేస్తూ సామాన్య ప్రజలపై అధిక భారం మోపుతున్నారని దీన్ని అరికట్టేందుకు మున్సిపల్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు ఎలాంటి ఆన్లైన్ బిల్లులు లేకుండా కేవలం ఆఫ్ లైన్ బిల్లుల ద్వారా బిల్లులు వసూలు చేయటంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు కనీసం కౌన్సిల్ తీర్మానం లేకుండా త్రాగునీటి బిల్లులు ఎలా వసూలు చేస్తారని కమిషనర్ ను ప్రశ్నించారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ ఆన్లైన్ బిల్లులు వచ్చేవరకు సిబ్బంది తాగునీటి బిల్లులు వసూలు



తాత్కారికంగా నిలిపివేస్తామని హామీ ఇచ్చారు .వారం రోజుల్లో కౌన్సిల్ సమావేశం నిర్వహించి తీర్మానం ప్రతిపాదిస్తామని తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రావుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ టిఆర్ఎస్, సిపిఐ సిపిఎం కౌన్సిలర్లు కట్టా స్వరూప రాణి ,తిరుపతి శివకుమారి, చిలక చిన్న కోటయ్య, కిన్నెర కృష్ణ, మాదిరిని సునీత దుర్గాప్రసాద్, నల్లమోతు శైలజ, ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షులు మద్దెల రవి, పట్టణ మహిళా మాజీ అధ్యక్షురాలు బానోత్ సక్కుబాయి, నాయకులు మాదినేని దుర్గాప్రసాద్, నూకల వాసు, పుల్లయ్య, పాసంగులపాటి శివ, బత్తుల రాజు ,కొత్త నరసింహారావు ,మాచర్ల శంకర్ ,నరసింహారావు, కట్ట నాగేశ్వరరావు, వేముల శివకృష్ణ, రంజాన్, వదినేపల్లి చక్రవర్తి, గుగులోతు బాలు, వీరన్న ,రేచర్ల సైదులు, వల్లెపు రాము తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం..

**మధిర, ఆగస్టు 4(మనం న్యూస్):** మధిర ప్రాజెక్టు సెక్టార్ 2 మడుపల్లి అంగన్వాడి సెంటర్లో సెక్టార్ సూపర్వైజర్ జక్కుల నాగ సత్యవతి ఆధ్వర్యంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ కృష్ణ శ్రీ పాల్గొని మాట్లాడుతూ తల్లిపాలు సంపూర్ణ ఆరోగ్యంతో పాటు, శిశువుకు రోగ నిరోధక శక్తిని పెంచుతాయని తల్లిపాలు తప్పక బిడ్డకు పట్టించాలని తెలియజేశారు. డబ్బా పాలు పట్టించటం వలన శిశువు ఎదుగుదలతో పాటు భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని తెలిపారు. అనంతరం వార్డ్ కౌన్సిలర్ నర్సిరెడ్డి మాట్లాడుతూ నవజాతి శిశువులకు తల్లిపాలు శ్రేష్టమన్నారు. తల్లి బిడ్డల శ్రేయస్సుకు తల్లిపాలు వినియోగం ఎంతో అవసరమని వివరించారు. అనంతరం డాక్టర్ పృద్వి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు మొదటి గంటలోనే తల్లిపాలు పట్టించాలన్నారు.మొదటి ఆరు నెలలు తల్లిపాలు శ్రేష్టమన్నారు. డబ్బా పాలు వద్దు - తల్లి పాలు ముద్దు అనే నినాదంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. గర్భిణీలకు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు.అనంతరం పిల్లలకు




అన్నప్రాసన, మరియు గర్భిణీలకు, శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్స్ లక్ష్మీ తులసి, సునీత,డాక్టర్ సుష్మ, వెంకటేశ్వరరావు, వెంకటలక్ష్మి,సితారా అంగన్వాడీ టీచర్స్ లక్ష్మి, రాధామాణిక్యం, శివకుమారి, మేరీ కుమారి, ఆయాలు విజయ, మరియు బాలింతలు, గర్భిణీలు, తల్లిదండ్రుల పిల్లలు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఫిర్యాదు

**ముదిగొండ ఆగస్టు 4(మనం న్యూస్ ):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ ముదిగొండ మండల కమిటీ మంగళవారం ముదిగొండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది.ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడం లేదనే మనస్థాపంతో ముదిగొండ మండలంలోని న్యూ లక్ష్మీపురం గ్రామానికి చెందిన గడ్డం వేణు కుమార్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నేపథ్యంలో, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఈ ఫిర్యాదు చేసినట్లు నాయకులు తెలిపారు. ఫిర్యాదును ముదిగొండ హెడ్ కానిస్టేబుల్ పి. వెంకటేశ్వర్లు స్వీకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వేణు కుమార్ కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, వారికి పక్కా ఇల్లు కేటాయించాలని, రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు తక్షణమే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ముదిగొండ మండలం మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, మండల కార్యదర్శి గడ్డం వెంకట్ గౌడ్, మాజీ రైతు మండల కోఆర్డినేటర్ పోట్ల వెంకటప్రసాద్,



సీనియర్ నాయకులు బంకా మల్లయ్య, బీసీ సెల్ మాజీ మండల అధ్యక్షుడు తోట ధర్మారావు, తెలంగాణ ఉద్యమకారుడు పొనుగుల కోటేష్ యాదవ్, మైనార్టీ సెల్ మాజీ మండల అధ్యక్షుడు షేక్ కాజా, ముదిగొండ గ్రామ నాయకులు కొమ్మూరి రమేష్, హఫీజ్, ఎం.డి. ఖాసీం బాబు, కె. నాగార్జున, ఎం. సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తల్లి-బిడ్డల క్షేమమే ఐసీడీఎస్ లక్ష్యం



**చింతకాని ఆగస్టు 4 (మనం న్యూస్):** తల్లి, బిడ్డల ఆరోగ్య పరిరక్షణే ఐసీడీఎస్ ప్రధాన లక్ష్యము అని రామకృష్ణాపురం గ్రామ సర్పంచ్ గాదె నాగలక్ష్మి అన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలని, తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారమని పేర్కొన్నారు.ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా చింతకాని మండలంలోని రామకృష్ణాపురం అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ గాదె నాగలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ. తల్లిపాలు తాగిన పిల్లల్లో రోగనిరోధక శక్తి అధికంగా ఉండటంతో పాటు శారీరక, మానసిక వికాసం మెరుగ్గా ఉంటుందని తెలిపారు. గర్భిణీలు గర్భం దాల్చినప్పటి నుంచే పోషకాహారం తీసుకోవాలని సూచించారు. పోషకాహార లోపం వల్ల రక్తహీనతతో పాటు ప్రసవ సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందని వివరించారు.స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై ర్యాలీలు, గృహ సందర్శనలు, సమావేశాల ద్వారా తల్లులు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందించే వ్యాధి నిరోధక టీక.

# ముదిగొండ మండల కాంగ్రెస్ పార్టీ కమిటీల రద్దు

**ముదిగొండ, ఆగస్టు 4(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు,అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఆదేశాల మేరకు ముదిగొండ మండల కాంగ్రెస్ పార్టీకి చెందిన అన్ని కమిటీలను రద్దు చేసినట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూడిపూడి బుచ్చిరామయ్య తెలిపారు.మండల కాంగ్రెస్ కమిటీతో పాటు మండల అనుబంధ సంఘాల కమిటీలు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల కమిటీలు, గ్రామ అనుబంధ కమిటీలు, బూత్ లెవల్ కమిటీలను కూడా రద్దు చేసినట్లు వెల్లడించారు.ఈ విషయాన్ని మధిర నియోజకవర్గ ప్రచార కమిటీ సభ్యుడు మట్టా రవీందర్ రెడ్డి సంయుక్తంగా ప్రకటించారు.ఈ కార్యక్రమంలో కందిమళ్ల వీరబాబు, కొమ్మినేని రమేష్ బాబు, పల్లిపాటి కృష్ణ, భూక్యా ధర్మానాయక్,



చేకుపల్లి రాంబాబు , వల్లూరి భద్రారెడ్డి, మల్లెల అజయ్, గూడా సాహెబ్ ఉసికల రమేష్, జెట్టి వినోద్, దొంతగాని నాగరాజు, మీగడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

మనం
జనం కోసం అక్షర యజ్ఞం..



## మధిర

మధిర - ఎర్రుపాలెం - బోనకల్- చింతకాని - ముదిగొండ

# మైనారిటీ వెల్ఫేర్ కార్పొరేషన్ రుణ పథకాల లబ్ధిదారుల ఎంపిక



**మధిర టౌన్,ఆగస్టు4(మనం న్యూస్):** మధిర పురపాలక పరిధిలో మైనారిటీ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా 2025-26 సంవత్సరానికి మంజూరు చేయవలసిన రుణాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న అర్హులైన అభ్యర్థులలో లబ్ధిదారుల ఎంపికను మంగళవారం మధిర పురపాలక కార్యాలయంలో డ్రా పద్ధతి ద్వారా అధికారుల సమక్షంలో నిర్వహించారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలలో లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించేందుకు డ్రా పద్ధతిని పారిదర్శకంగా అవలంబించారు. ఈ ప్రక్రియలో క్రింది పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగింది: 1. "ఈ-స్కూటర్" పథకంలిలి -- లి02 మంది లబ్ధిదారులులి, 2. లి"ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన" పథకంలి -- లి02 మంది లబ్ధిదారులులి,3. లి"రేవంత్ అన్న క సహర మిస్కీనో కె లియే" **పథకం 01 లబ్ధిదారు** : మొత్తం 05 మంది లబ్ధిదారులను డ్రా పద్ధతి ద్వారా ఎంపిక జరిగినట్లు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మధిర మున్సిపల్ కమిషనర్ సామ్యూల్ పాల్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు, సిబ్బంది మరియు దరఖాస్తుదారుల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించడం జరిగింది. ఎంపికైన లబ్ధిదారులకు సంబంధిత పథకం నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నారు.మధిర పురపాలక సంఘం ప్రజలకు అందించే సంక్షేమ పథకాలలో పారదర్శకత, జవాబుదారీతనం మరియు నిష్పక్షపాతంగా లబ్ధిదారుల ఎంపికకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు అధికారులు తెలియజేశారు.

# మంద సత్యానందానికి నివాళులర్పించిన పలువురు ప్రముఖులు

**బోనకల్, ఆగస్టు 4(మనం న్యూస్):** ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం గోవిందపురం (గ్రా) గ్రామానికి చెందిన విజన్ ఆంధ్ర పత్రిక విలేఖరి మంద సత్యానందం సోమవారం రాత్రి బోనకల్ రైల్వే బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించారు. సత్యానందం పార్థివ దేహాన్ని మంగళవారం గోవిందపురం లోని వారి స్వగృహం వద్ద ప్రజల సందర్శనార్థం ఉంచారు.మంద సత్యానందం పార్థివ దేహాన్ని పలువురు ప్రముఖులు దర్శించి పూలమాలతో నివాళులర్పించి,శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్, మధిర డివిజన్ కమిటీ సభ్యులు బంధం శ్రీనివాసరావు, జొన్నలగడ్డ సునీత, తెల్లాకుల శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు దొండపాటి సత్యనారాయణ, గుగులోతు నరేష్, పసుపులేటి నరేష్ , కారంగుల చంద్రయ్య, కొమ్మినేని నాగేశ్వరరావు, కెవిపిఎస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్ , కెవిపిఎస్ బోనకల్ మండల నాయకులు కొమ్ము శ్రీనివాసరావు, నరేష్, శ్రీను, బాబు, గోవిందాపురం సిపిఎం నాయకులు వీరభద్రం, రామచంద్రరావు,బుచ్చయ్య, శ్రీనివాసరావు,సురేష్ , ఖమ్మం జిల్లా యుటిఎఫ్ నాయకులు వల్లం కొండ రాంబాబు,బోనకల్ మండలంలోని పత్రిక విలేకరులందరూ, గోవిందపురం గ్రామంలోని ప్రజలందరూ పార్టీలకతీతంగా మంద సత్యానందం పార్థివదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు





మనం




సత్తుపల్లి

సత్తుపల్లి - వేంసూరు - పెనుబల్లి - కల్లూరు - తల్లాడ

## వాడుకలో లేని ఖబరస్తాన్ భూమిపై అక్రమార్కుల కన్ను?

**– వక్ఫ్ బోర్డు గెజిట్‌లో నమోదైన స్థలాన్ని కాపాడాలని ముస్లింల డిమాండ్**




**సత్తుపల్లి టౌన్ , ఆగస్టు 4 (మనం న్యూస్ ):** సత్తుపల్లి పట్టణంలోని పాత ఖబరస్తాన్ (ఖననవాటిక) భూమిపై అక్రమంగా కన్నేసి, దానిని విక్రయించే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ పట్టణంలో చర్చ జరుగుతోంది. 1990 జనవరి 1న విడుదలైన వక్ఫ్ బోర్డు గెజిట్ నం.4-ఎ, సీరియల్ నం.10555, సర్వే నం.131లో నమోదైన ఈ స్థలం వక్ఫ్ బోర్డు ఆస్తిగా రికార్డుల్లో ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.స్థానికుల కథనం ప్రకారం, గతంలో ఓ దాత సుమారు 20 కుంటల భూమిని ఖబరస్తాన్ కోసం వక్ఫ్ బోర్డు ద్వారా మసీదుకు దానం చేశారు. ప్రస్తుతం అందులో సుమారు 13 కుంటలకే ప్రహరీ గోడ ఉండగా, మిగిలిన భూమి ఆక్రమణకు గురైందని ఆరోపిస్తున్నారు. అనంతరం జవహర్‌నగర్ ప్రాంతంలో కొత్త ఖబరస్తాన్‌కు ప్రభుత్వం స్థలం కేటాయించడంతో, ప్రస్తుతం మృతదేహాల ఖననం అక్కడే జరుగుతోందని తెలిపారు. పాత ఖబరస్తాన్‌ను రంజాన్, బక్రీద్, మొహర్రం వంటి సందర్భాల్లో మాత్రమే సందర్శిస్తున్నారని పేర్కొన్నారు.ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు పాత ఖబరస్తాన్ భూమిని విక్రయించే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ రహదారి ఇప్పటికే ఉన్నప్పటికీ, ఖబరస్తాన్ గోడ తొలగించి దారి కల్పిస్తామని, అనుమతులు ఇప్పిస్తామని కొందరు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారనే విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి.అలాగే, పాత మాన్యువల్ పహాణీల ఆధారంగా భూమిపై వారసత్వ హక్కులు ఉన్నాయని కొందరు ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకువచ్చి, వక్ఫ్ బోర్డు ఆస్తిని కబ్జాల నుంచి రక్షించేలా మసీదు కమిటీ, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ముస్లింలు కోరుతున్నారు.



## బాసర సీటు సాధించిన విద్యార్థి ఆదిత్యకు 25 వేలు ఆర్థిక సాయం అందజేత..



**తల్లాడ, ఆగస్టు 4 (మనం న్యూస్):** వైరా మండలం సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి ట్రిపుల్ ఐటీ బాసరలో సీటు సంపాదించిన కంభంపాటి ఆదిత్య నిరుపేద కుటుంబం కావడంతో తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990-1991 బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్పందించి ఆదిత్యకు 25 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ నగదును మంగళవారం సదరు విద్యార్థికి పూర్వ విద్యార్థులు అప్పలరాజు సరికొండ అప్పలరాజు, పఠాన్ రహీం, చింతల క్రిషయ్య చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి చదువులో రాణించిన ఆదిత్య కు ఆర్థికంగా ఆదుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆ విద్యార్థి మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి పలువురికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# సంఖ్య చిన్నది.... సంకల్పం గొప్పది!

**– పాఠశాల పూర్వ వైభవం కోసం ప్రయత్నాలు**
**– ఒక్క విద్యార్థితో పునఃప్రారంభం... ప్రస్తుతం ఎనిమిది మందితో విద్యా ప్రస్థానం**
**– 100% విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తాం: సర్పంచ్ భూక్య రవీందర్ ఉపాధ్యాయులు భానోత్ లక్ష్మణ్**







**కల్లూరు ఆగస్టు 04(మనం న్యూస్):** ఒకప్పుడు విద్యార్థుల కొరతతో తలుపులు మూసుకున్న ఆ పాఠశాల... నేడు మరోసారి తన పూర్వ వైభవాన్ని దక్కించుకునేందుకు ప్రయత్నిస్తుంది. వెలవెలబోయిన తరగతి గదులు మళ్లీ విద్యార్థుల సందడితో కళకళలాడేందుకు స్థానికుల సహకారంతో గ్రామసర్పంచ్ భూక్య రవీందర్, పాఠశాల ఉపాధ్యాయుడు భానోత్ లక్ష్మణ్ పిల్లల తల్లిదండ్రులతో చర్చిస్తున్నారు. ఒకప్పుడు పదుల సంఖ్యలో పిల్లలతో కొనసాగిన పాఠశాల అనంతరం పిల్లల కొరతతో మూతబడిన కొంతకాలానికి పునః ప్రారంభమై ఒకే ఒక్క విద్యార్థితో సతమతమవుతూ ప్రస్తుతం ఎనిమిది మంది విద్యార్థులతో గ్రామంలో కొత్త ఆశలను రేకెత్తిస్తుంది.విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోవడం, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపడం, గ్రామంలో జనాభా మార్పులు వంటి కారణాలతో ఈ పాఠశాల కొన్నేళ్ల క్రితం మూతపడింది.చిన్నారులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.అయితే గ్రామ ప్రజలు, విద్యాభిమానులు, విద్యాశాఖ అధికారులు కలిసి పాఠశాలను తిరిగి ప్రారంభించేందుకు కృషి చేశారు. వారి ప్రయత్నాలు ఫలించి పాఠశాల మళ్లీ తెరుచుకుంది. ప్రారంభంలో ప్రభుత్వ పాఠశాలపై తల్లిదండ్రులు అంతగా ఆసక్తి చూపకపోయినా ఉపాధ్యాయుడు నిరుత్సాహపడకుండా అదే ఉత్సాహంతో బోధన కొనసాగించారు. గ్రామస్తుల సహకారం, తల్లిదండ్రుల నమ్మకం, ఉపాధ్యాయుల అంకితభావం కలిస్తే మూతపడిన పాఠశాల మళ్లీ నిలదొక్కుకోగలదనే విషయాన్ని ఈ పాఠశాల నిరూపిస్తోంది. రానున్న విద్యా సంవత్సరంలో మరింత మంది విద్యార్థులను చేర్చుకోవాలని,తమ పాఠశాలను ఆదర్శ విద్యాలయంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయుడు లక్ష్యంగా పెట్టుకున్నారు. గిరిజన ప్రాంతానికి చెందిన పాఠశాల కావడంతో ఐటిడిఏ నిధులతో పాఠశాలను ఉన్నతంగా తీర్చిదిద్దడం జరిగింది. పాఠశాల అభివృద్ధి కేటాయించే నిధులతో సకల సౌకర్యాలు కలిగిస్తూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రజలు సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని కోరుతున్నారు.

# అటవీ నేరాలకు పాల్పడితే ఉపేక్షించబోం..

**– తల్లాడ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఉమా హెచ్చరిక..**
**– పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితుల అరెస్ట్..**






**తల్లాడ, ఆగస్టు 4 (మనం న్యూస్);** తల్లాడ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కల్లూరు సెక్షన్‌లో ఇటీవల అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి ఎలుగుబంటిని హతమార్చిన కేసులో పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులను అటవీ శాఖ అధికారులు సోమవారం మధ్యాహ్నం చాకచక్యంగా అరెస్టు చేశారు.ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేసి సత్తుపల్లి న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం వారిని 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించిన విషయం విదితమే. ఈ కేసులో పరారీలో ఉన్న అజ్మీర కృష్ణ (కొత్తబోడు మల్లె గ్రామం), ఏనుగంటి రామకృష్ణ (లోకారం గ్రామం) కోసం తల్లాడ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఉమా ఆధ్వర్యంలో ప్రత్యేక రెక్కీ నిర్వహించి, ఉదయం వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని సత్తుపల్లి న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం 11 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో ఖమ్మం జిల్లా కారాగారానికి తరలించారు. ఈ సందర్భంగా తల్లాడ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి ఉమా మాట్లాడుతూ అటవీ నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, అటవీ, వన్యప్రాణి సంరక్షణ చట్టాల ప్రకారం నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అడవుల్లో అక్రమ వేట, విద్యుత్ తీగల ఏర్పాటు వంటి నేరాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి. సురేష్ కుమార్, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, రమేష్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ (కోర్టు డ్యూటీ), నక్క రమేష్, అజమ్ ఆలీ (ఫారెస్ట్ బీట్ ఆఫీసర్), తెనాలి శీను, తేజాద్ కృష్ణ, అంజద్ పాషా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బొంతు వెంకటేశ్వరరావుకు నివాళులర్పించిన మువ్వా



**వేంసూరు, ఆగష్టు 04 (మనం న్యూస్):** వేంసూరు మండలం పరిధిలోని జయలక్ష్మి పురం గ్రామనికి చెందిన బొంతు గిరి తండ్రి బొంతు వెంకటేశ్వరరావు మృతిచెందగా టిజిఐడిసి చైర్మన్ మువ్వా విజయబాబు బొంతు వెంకటేశ్వరరావు పార్థీవ దేహానికి నివాళులర్పి ంచి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బొంతు వెంకటేశ్వరరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని భరించే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని వేడుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలి యజేశారు. గ్రామ ప్రజలు, సత్తుపల్లి పట్టణ వైస్ చైర్మన్ బొంతు సుమలత, బేత్తుపల్లి గ్రామ సర్పంచ్ దొడ్డా రాజేం ద్రప్రసాద్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి, మువ్వా అభిమానులు పాల్గొన్నారు.

మనం

కొత్తగూడెం

కొత్తగూడెం కార్పొరేషన్ - సింగరేణి




## భద్రాద్రి జిల్లాలో ప్రతి ఎకరాకు
# సీతారామ జలాలు అందించాలి

- ధరల పెరుగుదల, కార్మిక చట్టాలపై దాడిని ప్రతిఘటిద్దాం
- పెండింగులో ఉన్న పోడు భూములకు పట్టాలిచ్చి ఆదుకోవాలి
- బద్లావ్ జరూరీ హై' నినాదంతో దేశవ్యాపిత నిరసనలు
- ఆగష్టు 6 నుంచి 'ప్రజాచైతన్య యాత్రలు'
- మీడియా సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా



**కొత్తగూడెం టౌన్, ఆగస్టు 4 (మనం న్యూస్) :** సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని ప్రతీ ఎకరానికి సాగునీరు అందించి జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలని, ప్రాజెక్టుల నిర్మాణంలో భూములు కొల్పిన నిర్వాసితులకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా డిమాండ్ చేశారు. కొత్తగూడెం పట్టణ పరిధిలోని తాటిపల్లి రిసిడెన్సీలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 7,80,000 ఎకరాల ఆయకట్టు ఉండగా, ప్రస్తుతం కేవలం 2,40,000 ఎకరాలకే నీరు అందే పరిస్థితి ఉందన్నారు. సుమారు 100 కిలోమీటర్లకు పైగా గ్రావిటీ కాలువలు తవ్వి స్థానిక ప్రజలను నిర్వాసితులను చేసినప్పటికీ పూర్తి స్థాయిలో జిల్లా రైతాంగానికి సాగునీరు అందించకపోవడం దుర్మార్గమైదన్నారు. ఆయకట్టు పరిధిని పెంచి ఇల్లందు, పినపాక, అశ్వారావుపేట, కొత్తగూడెం, భద్రాచలం నియోజకవర్గాల్లోని చెరువులను నింపి సాగునీరు అందించాలని కోరారు. నిత్యావసరాలు, పెట్రో ఉత్పత్తుల ధరలను నియంత్రించాలని, పంటలకు కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయాలన్నారు. కేంద్రం మార్చిన 44 కార్మిక చట్టాలను రద్దు చేయాలని, విద్య, ఉపాధి హక్కులను రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులుగా చేర్చాలని స్పష్టం చేశారు. మతోన్మాద శక్తుల నుంచి దేశ ఐక్యతను, రాజ్యాంగాన్ని కాపాడు కోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లాలో మిగిలిన 73,000 ఎకరాల పోడు భూములకు వెంటనే పట్టాలు పంపిణీ చేయాలని, కేటీపీఎస్ సమీపంలో కొత్త ప్లాంటును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భద్రాచలానికి ఆనుకుని ఉన్న 5 గ్రామ పంచాయతీలను తెలంగాణలో కలపాలని, విద్యా, వైద్య రంగాలను పేదలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల సాధనకై సీపీఐ ఆధ్వర్యంలో ?దేశవ్యాప్తంగా ఆగస్టు 6 నుండి 14 వరకు "ప్రజా చైతన్య యాత్రలు" అందులో భాగంగా జాతీయ, జిల్లా స్థాయి సమస్యలపై భద్రాద్రి జిల్లాలో ఏడూళ్ల బయ్యారం నుంచి అశ్వారావుపేట వరకు అన్ని మండలాలను, గ్రామాలను కలుపుతూ యాత్రలు చేపడుతున్నామని తెలిపారు. ? సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో లక్షలాది మందితో "దేశంలో మార్పు కోసం" భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. యాత్రలకు అన్నివర్గాల ప్రజలు సంఘీభావం తెలపాలని కోరారు. విలేకర్ల సమేషంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు, చంద్రగిరి శ్రీనివాసరావు, వి పూర్ణచందర్ రావు, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, గనగళ్ళ వీరాస్వామి, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్ కె ఫహీమ్ పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై మురుగునీటి మయం..

**– మూడు రోజులైనా స్పందించని అధికారులు!**

**రామవరం, ఆగస్టు 4: (మనం న్యూస్) :** జాతీయ రహదారి ఎన్‌హెచ్-30పై రామవరం మెయిన్ రోడ్ బస్టాండ్ ఎదురుగా, కనకదుర్గ ఆటో స్టాండ్ సమీపంలో గత మూడు రోజులుగా మురుగునీరు నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షపు నీరు, కాలువ నీరు కలిసి రోడ్డుపై నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆటో స్టాండ్, టిఫిన్ సెంటర్లు, ఇతర వ్యాపార సంస్థల ముందు మురుగునీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లడమే కాకుండా అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ప్రతిరోజూ వాహనాలు ఈ నీటిలోంచి వెళ్లడంతో మురికి నీరు చిందర వందరగా ఎగిరి వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.



వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు వర్షపు నీరు సులభంగా వెళ్లేలా డ్రైనేజీ వ్యవస్థను నిర్వహించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, సమస్యను ఇప్పటివరకు పరిష్కరించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిల్వ నీటి కారణంగా దోమలు పెరిగి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగునీటిని వెంటనే తొలగించి, శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

## క్రమశిక్షణతోనే గుర్తింపు

**– సింగరేణి సెక్యూరిటీ ట్రైనింగ్ అధికారి జాకీర్ హుస్సేన్**

**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 4(మనం న్యూస్):**
క్రమశిక్షణతో విధి నిర్వహణ మెరుగు పడడంతో పాటు గుర్తింపు లభిస్తుందని సింగరేణి సెక్యూరిటీ అండ్ ట్రైనింగ్ అధికారి జాకీర్ హుస్సేన్ అన్నారు. కొత్తగూడెం ట్రైనింగ్ సెంటర్లో నాలుగు రోజులపాటు జరిగే శిక్షణ తరగతులను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ సెక్యూరిటీ సిబ్బంది అందరికీ క్రమశిక్షణ అనేది ముఖ్యమని పేర్కొన్నారు. మనం క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నపుడే గుర్తింపు వస్తుందని ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణ సెక్యూరిటీ సిబ్బంది అందరికీ అవసరం అని చెప్పారు. ఈ శిక్షణ వలన డ్యూటీ జీవితంలోనే కాకుండా వ్యక్తిగతంగా కూడా ఉపయోగకరమైనదని ఈ నాలుగు రోజుల శిక్షణా కాలంలో ట్రాఫిక్ రెగ్యులేటరీ చట్టం మాండేటరీ కాషనరీ ఇన్ఫర్మేటరీ సిగ్నల్స్ ట్రాఫిక్ పాయింట్ మన్ డ్యూటీస్ క్రౌడ్ కంట్రోల్ వంటి అంశాలపై అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీచే పూర్తి అవగాహన కలిగించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ వలన ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా మెయిన్ గేటు వద్ద చెక్



పోస్ట్ ల వద్ద రద్దీ లేకుండా సాఫీగా అందరు తమ విధులను సక్రమంగా నిర్వహించేందుకు దోహదం చేస్తుందని తెలిపారు. ఎస్ అండ్ పిసి విభాగము పటిష్టంగా ఉండేందుకు కావలసిన అన్ని రకాల చర్యలు ట్రైనింగ్ సెంటర్ అభివృద్ధికి అన్ని రకాల సహాయ సహకారాలు యాజమాన్యం అందిస్తుందని తెలిపారు. సెక్యూరిటీ సిబ్బంది అందరు మెరుగైన వృత్తి నైపుణ్యంతో అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ సింగరేణి ఆస్తులు స్థలాలను పరిరక్షించాలని సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఇన్స్పెక్టర్ కె.రాజనర్సు, ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీనగర్ గ్రామపంచాయతీలో దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమం

**కొత్తగూడెం టౌన్, ఆగస్టు 3 (మనం న్యూస్) :** శ్రీనగర్ గ్రామపంచాయతీ పరిధిలో దోమల నివారణ చర్యల్లో భాగంగా సోమవారం భగవద్గీత ఆశ్రమం వైపు ఫాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బానోత్ రాణి ఆధ్వర్యంలో, గ్రామ కార్యదర్శి వంశీకృష్ణ ఆదేశాల మేరకు చేపట్టారు.



ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ రాణి, కార్యదర్శి వంశీకృష్ణ మాట్లాడుతూ, గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా ఫాగింగ్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. శ్రీనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని వార్డుల్లో దశలవారీగా ఫాగింగ్ నిర్వహించి, ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.
దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు. గ్రామ ప్రజలు కూడా గ్రామపంచాయతీ చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాలకు సహకరించాలని కోరారు.

## మహిళల భద్రతపై అవగాహన




**కొత్తగూడెం క్రైమ్ , ఆగస్టు 4 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ రోహిత్ రాజు గారి ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా షీ టీమ్ సిబ్బంది మహిళలు, బాలికల భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ ఎస్ఐ రమాదేవి, షీ టీం పోలీసు అధికారి లక్ష్మణ్ మాట్లాడుతూ మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులు, సైబర్ నేరాలు లేదా ఈవ్‌టీజింగ్‌కు గురైన వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. మహిళల రక్షణ కోసం తెలంగాణ పోలీసు శాఖ అందిస్తున్న షీ టీమ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, వేధింపులకు భయపడకుండా ఫిర్యాదు చేయాలని కోరారు. సైబర్ మోసాలు, సోషల్ మీడియా ద్వారా పరిచయాలు, నకిలీ ఉద్యోగాలు, పెట్టుబడుల పేరుతో జరిగే మోసాలపై అప్రమత్తంగా ఉండాలని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్-112, మహిళల సహాయ సేవలు, షీ టీమ్‌కు ఫిర్యాదు చేసే విధానాన్ని వివరించి, ప్రతి ఫిర్యాదును గోప్యంగా స్వీకరించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళల భద్రతకు తెలంగాణ పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. షీ టీమ్‌ల లక్ష్యం మహిళలు భయరహిత వాతావరణంలో జీవించేలా చేయడమేనని తెలిపారు. షీ టీమ్స్ మహిళల భద్రత, వేధింపుల నివారణ, అవసరమైనప్పుడు తక్షణ పోలీసు సహాయం అందించేందుకు తెలంగాణ పోలీసు శాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విభాగం.



మనం
జనం కోసం అక్షర యజ్ఞం..



# పాల్వంచ

పాల్వంచ సిటీ - పాల్వంచ మండలం

## ఐఏఎస్ ప్రియాంక అలాను మర్యాదపూర్వకంగా కలిసిన వైవి

### - పుష్పగుచ్ఛం అందజేత



పాల్వంచ, ఆగష్టు 4(మనం న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గా పనిచేసి, ప్రస్తుతం హైదరాబాద్ కలెక్టర్ గా పనిచేస్తున్న డాక్టర్ ప్రియాంక అలా ఐఏఎస్ ను ఒలింపిక్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, జిల్లా కాంగ్రెస్ నాయకులు వై వెంకటేశ్వర్లు ఖైరతాబాద్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికై ఆమె చేసిన సేవలను కొనియాడారు. పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపి, శుభాకాంక్షలు తెలిపారు.

## కిన్నెర జలపాతానికి వరద పోటు

### - 399.80 అడుగులకు చేరిన కిన్నెర నీటిమట్టం
### - ఇన్ ఫ్లో 8 వేల 3 వందల క్యూసెక్కులు



పాల్వంచ, ఆగష్టు 4(మనం న్యూస్): కిన్నెరసాని జలపాతం వరద నీటితో అలరారుతుంది. ఎగువ ప్రాంతాలైన నర్సంపేట, గుండాల, పాకాల తదితర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున వరద నీరు కిన్నెర జలపాతానికి చేరుతోంది. కిన్నెర పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా, మంగళవారం మధ్యాహ్నం 399.80 అడుగులకు చేరినట్లు డ్యాం సైట్ యంత్రాంగం పేర్కొంది. రిజర్వాయర్ కు ఇన్ ఫ్లో 8వేల 3 వందల క్యూసెక్కులు. అవుట్ ఫ్లో లేదని కేటీపీఎస్ ఇంజనీర్లు పేర్కొన్నారు.

## వరద నీటితో స్తంభించిన రాకపోకలు

### - శ్రీనివాస్ కాలనీ వద్ద నిలిచిన వరద నీరు
### - కమిషనర్, డిప్యూటీ మేయర్ తక్షణ చర్యలు




పాల్వంచ, ఆగష్టు 4(మనం న్యూస్): దమ్మపేట సెంటర్ నుంచి ములకలపల్లి వెళ్లే ప్రధాన రహదారి వరద నీటితో స్తంభించింది. శ్రీనివాస కాలనీ సమీపంలోని శివాలయం వద్ద రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా రోడ్డుపై నీరు నిలిచి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాకపోకలకు అంతరాయం కలిగింది. సమస్యను గుర్తించిన వెంటనే కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ సుజాత, డిప్యూటీ మేయర్ లలితకుమారి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని తక్షణమే తొలగింపు చర్యలు చేపట్టారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. ప్రజల సమస్యపై వెంటనే స్పందించి పరిష్కారం చూపిన కమిషనర్ సుజాత, డిప్యూటీ మేయర్ లలితకుమారి లకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. తక్షణ చర్యలపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కార్మిక రంగ సమస్యలు పరిష్కరించాలి

### - సెప్టెంబర్ 1న సదస్సు, ప్రదర్శనను జయప్రదం చేయండి : ఐఎఫ్టియు




పాల్వంచ, ఆగష్టు 4(మనం న్యూస్): సంఘటిత, సంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. సెప్టెంబర్ 1న కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరిగే సదస్సు, ప్రదర్శనను జయప్రదం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ ఎఫ్ టి యు) జిల్లా ప్రధాన కార్యదర్శి జె సీతారామయ్య పిలుపునిచ్చారు. పాల్వంచ బస్టాండ్ సెంటర్లో ఐఎఫ్టియు పాల్వంచ ఏరియా కమిటీ కార్యదర్శి మంకెన వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. సీతారామయ్య మాట్లాడుతూ.. పర్మినెంట్ కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ స్కీం వర్కర్ల సమస్యలు చాలా ఉన్నాయని పేర్కొన్నారు. ఏ రంగంలో చూసినా సమస్యలు అలాగే ఉన్నాయని, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం పూనుకునే విధంగా లేదని ఆన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు దొందు దొందుగానే వ్యవహరిస్తూ.. కార్మికులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మేము అధికారంలోకి వస్తే కార్మిక సంక్షేమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పి తప్పుకున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెండింగ్లో ఉన్న 72 షెడ్యూల్ జీవోలను కనీసం విడుదల చేయలేదని వాటి ఊసు కూడా ఎత్తడం లేదని విమర్శించారు. అంతే కాకుండా నాలుగు లేబర్ కోడ్ లు అమలు చేయడంలో రేవంత్ రెడ్డి అత్యుత్సాహం ప్రదర్శిస్తూ.. ఈ మధ్యకాలంలో 10 గంటల పని జీవోను విడుదల చేయడం, కార్మికుల తిరుగుబాటుకు వెనక్కి తీసుకోవడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ రంగాన్ని మొత్తం ప్రైవేటు పరం చేస్తూ, ప్రైవేటు సెక్టార్లలో ఉన్న అసంఘటిత కార్మికుల పట్ల అనేక కొత్త జీవోలు తీసుకొస్తూ.. వారిని వెట్టిచాకిరితో బానిస లుగా చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ సమస్యల పరిష్కారం వెలుగులో ఐఎఫ్టియు కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై సెప్టెంబర్ 1న కొత్తగూడెంలో జిల్లా స్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా నాయకులు గౌని నాగేశ్వరరావు, ఏరియా కార్యదర్శి మంకెన వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి ఎర్రం శ్రీను, నాయకులు కే మల్లేష్, బీ రూప్సింగ్, గాంధీ, రమేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మికుల ఆందోళనపై స్పందన ఏది?

- టీఎస్పీఈ జేఏసీ
- ప్రైవేటీకరణ అర్థరహితం
- టెండర్లు తక్షణం రద్దు చేయాలి
- కొనసాగుతున్న ఆందోళన
- 36వ రోజుకు చేరిన నిరసన




పాల్వంచ, ఆగష్టు 4(మనం న్యూస్): విద్యుత్ కార్మికుల సంక్షేమానికి పాలకవర్గాలు చిత్తశుద్ధితో కృషి చేయాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ స్పష్టం చేసింది. కార్మిక హక్కులను కాపాడాలని విద్యుత్ ఉద్యోగులు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన కార్యక్రమం చేపడుతున్నా .. పాలకవర్గాల నుండి స్పందన శూన్యమని జాక్ ఆందోళన వ్యక్తం చేసింది. విద్యుత్ ఉద్యోగులను విస్మరిస్తే పాలకవర్గాలకు ప్రతిఘటన తప్పదని జేఏసీ స్పష్టం చేసింది. జేఏసీ పిలుపులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ( వై టి పి ఎస్ ) పరిధి విభాగాలను ప్రైవేటీకరించే ప్రతిపాదనను నిరసిస్తూ.. కొనసాగుతున్న ఆందోళన మంగళవారం 36వ రోజుకు చేరింది. కేటీపీఎస్ ఏడవ దశలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. అంబేద్కర్ సెంటర్ లో పెద్ద ఎత్తున ఉద్యోగులు ఆందోళన కొనసాగించారు. నల్ల బ్యాడ్జీలతో నినాదాలు చేశారు. పెద్ద సంఖ్యలో ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మికులు, ఆర్టిసన్లు పాల్గొని, ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలను తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో టీఎస్ పీఈ జేఏసీ చైర్మన్ రాజేందర్, కన్వీనర్ ఎస్.కె. యస్మీన్, జేఏసీ నాయకులు ఉమామహేశ్వర రావు, సెక్రటరీ జనరల్ కరుణాకర్ రెడ్డి, బ్రహ్మాజీ, మధుబాబు, నరసింహారావు, సయ్యద్, సంపత్, చంద్రకళాధర్, మహేష్, రఘువీర్, రాధాకృష్ణ, కేశబోయిన కోటేశ్వరరావు, సీతారామి రెడ్డి, తిరుపతి, వెంపటి వెంకటేశ్వర్లు, దోలి శ్రీనివాసరావు, బాగ్యరాజు, పావని, లక్ష్మి, జ్యోతి, వాహిని పాల్గొన్నారు.

## ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయండి : నిమ్మల రాంబాబు

### - పోస్టర్ల ఆవిష్కరణ



పాల్వంచ, ఆగష్టు 4(మనం న్యూస్): ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. ఆగస్టు 6వ తేదీ నుండి 12వ తేదీ వరకు జిల్లాలో జరిగే ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు పేర్కొన్నారు. ఉల్వనూరు గ్రామంలో మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా, ఎందరో పాలకులు మారినప్పటికీ.. ప్రజలకు కనీస అవసరాలను సక్రమంగా తీర్చలేని దుస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను పాలిస్తున్న పాలకులు ఎన్నికల సమయంలో ప్రజలకు అలివి గాని హామీలను ఇచ్చి, ఓట్లు దండుకొని గద్దెనెక్కిన తర్వాత ప్రజా సమస్యలు పరిష్కరించక పోగా.. మోహం చాటేసాయని ఎద్దేవా చేశారు. రైతులు, కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగ యువతీ, యువకులు, మహిళలు, ఉద్యోగులు హక్కులు కావాలని శాంతియుతంగా నిరసన, ఉద్యమాలు చేసినందుకు పోలీసులను ఉసిగొలిపి నిరసనకారులపై లాఠీలు, తూటాలు, భాష్పవాయువులు, ముళ్ళకంచెలు ప్రయోగించి వందలాది మందిని గాయపరిచి కొందరిని చంపి రాక్షసంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వీటన్నిటికీ వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 6 నుండి 12 వరకు భద్రాద్రి జిల్లాలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర పల్లె పల్లెకు వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ప్రజలను చైతన్య పరచటమే ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. అందులో భాగంగా 8న మండల పరిధి రంగాపురం, జగన్నాథపురం, కిన్నెరసాని, సత్యనారాయణపురం, ఉలవనూరు, రేగుల గూడెం, తుమ్మలగూడెం గ్రామాలలో యాత్ర, బహిరంగ సభలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సభలకు పాల్వంచ వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు, ప్రజాసంఘాల నాయకులు నిట్ల అమృత రావు, వజ్జ వెంకన్న, కాలం నరసింహారావు, సర్పా రాజేష్, కాలం కోటేశ్వరరావు, వాసం బాబు తదితరులు పాల్గొన్నారు.

మనం




# అశ్వారావుపేట

అశ్వారావుపేట - దమ్మపేట - అన్నపురెడ్డిపల్లి - చంద్రుగొండ - ములకలపల్లి

# దొంతుకుంట చెరువు ఆయకట్టు రైతులు నిరసన

**- ఎండిపోతున్న పంటలు**

**- అధికారుల నిర్లక్ష్యం**



**అశ్వారావుపేట ఆగస్టు 4(మనం న్యూస్ ) :** వర్షాకాలం సీజన్ ప్రారంభమై సాగు పనులు వేగవంతమవుతున్న సమయంలో, నీళ్లు లేక పంటలు ఎండిపోతాయేమోనన్న ఆందోళనతో అశ్వారావుపేట దొంతికుంట చెరువు ఆయకట్టు రైతులు తీవ్ర నిరసనకు దిగారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నీటి ప్రవాహాన్ని అడ్డుకునేందుకు నిర్మించిన మట్టికట్టను జేసీబీ సాయంతో తొలగించి, చెరువులోకి నీటిని మళ్లించారు.

**రూ. 5 కోట్ల అభివృద్ధి పనులే శాపంగా మారాయా?**

దొంతకుంట చెరువు సుందరీకరణ మరియు అభివృద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వం రూ. 5 కోట్ల నిధులను మంజూరు చేసింది. పనుల్లో భాగంగా అధికారులు చెరువు చుట్టూ మట్టికట్టలు వేసి, చెరువులోకి వచ్చే సహజ నీటి ప్రవాహాన్ని మరియు కాలువలను పూర్తిగా బంద్ చేశారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ కావడంతో పంటల సాగుకు నీరు అత్యంత అవసరంగా మారింది. చెరువులోకి నీరు రాకుండా బంద్ చేయడంతో ఆయకట్టు రైతులు ఆందోళన



చెందారు. ఈ సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా, నివేదికలు అందించినా వారు ఏమాత్రం స్పందించకపోవడంతో ఐక్యంగా ఉండి పోరాడేందుకు రైతులు నిశ్చయించుకున్నారు. ?జేసీబీతో గండి కొట్టి చెరువులోకి నీటి మళ్లింపు, తన పంటలను కాపాడుకోవడమే ప్రాథమిక ధ్యేయంగా భావించిన రైతులందరూ ఒక్కటయ్యారు. అధికారుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దొంతికుంట చెరువు నీటి రాకను అడ్డుకుంటున్న కట్టను జేసీబీ యంత్రం ద్వారా స్వయంగా తొలగించారు. చెరువులోకి వర్షం వస్తున్న ప్రవాహ నీరు చెరువులోకి చేరుతుండటంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ?మాకు అభివృద్ధి కంటే ముందే పంటలకు సాగునీరు ముఖ్యం, ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా స్పందించకపోవడంతోనే మేమే స్వయంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది.

--- బాధిత రైతులు, అశ్వారావుపేట అభివృద్ధి పనులు చేపట్టే సమయంలో సాగునీటి అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని, ఇకనైనా అధికారులు స్పందించి తమకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# సైబర్ భద్రతపై నెలరోజుల ప్రత్యేక ప్రచారం

**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు 4 (మనం న్యూస్):** సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను చైతన్యపరిచేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు నెలరోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో చేపట్టనున్న "సురక్ష కా తిరంగా -- సైబర్ స్వతంత్ర తెలంగాణ" ప్రచార కార్యక్రమం పోస్టర్‌ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆగస్టు 5 నుంచి నెలాఖరు వరకు జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లలో సైబర్ భద్రతపై విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రస్తుతం స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో జరుగుతున్న సైబర్ ఆర్థిక మోసాలు పెరుగుతున్నాయని, అధిక లాభాల ఆశ చూపే ప్రకటనలు, అపరిచిత లింకులు, నకిలీ యాప్‌లను నమ్మి డబ్బులు బదిలీ చేయొద్దని ప్రజలకు సూచించారు. "ఆగు--ఆలోచించు-- నిజం నిర్ధారించు" అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని



కోరారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయడం ద్వారా నష్టాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అరికట్టడంతో పాటు సైబర్ సురక్షిత తెలంగాణ లక్ష్యాన్ని సాధించవచ్చని ఎస్పీ స్పష్టం చేశారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, సైబర్ సెల్ సీఐ జితేందర్, ఎస్బీ--2 ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, సైబర్ సెల్ ఎస్ఐ జుబేదా బేగం, సైబర్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

# దళితుల పేరుతో రాజకీయాలు మానాలి

**- అంబేద్కర్ అభ్యాసం ప్రతి దళితుడికి అందేలా పోరాడాలి: స్థానిక దళితుల డిమాండ్**

**కొత్తగూడెం, టౌన్ ఆగస్టు 4 (మనం న్యూస్ ) :** కొత్తగూడెం నియోజకవర్గంలో దళితుల పేరు చెప్పుకొని రాజకీయాలు చేయడం మానుకోవాలని పాత కొత్తగూడెం 11 డివిజన్ సిపిఐ పార్టీ డివిజన్ కార్యదర్శి కుంపటి నాగరాజు మాదిగ పేర్కొన్నారు. చర్మకారుల ఇళ్ల స్థలాలు, లిడ్‌క్యాప్‌కు సంబంధించిన పథకాల పేరుతో ఎన్నో ఏళ్లుగా హామీలు ఇస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని వారు ఆరోపించారు. గతంలో అధికార పార్టీలో ఉన్నప్పుడు దళితుల సమస్యలను పట్టించుకోని కొందరు నాయకులు, ఇప్పుడు మరో పార్టీ కండువా కప్పుకొని అదే అంశాలతో ప్రజల్లోకి వస్తున్నారని విమర్శించారు. రోడ్ల పక్కన చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్న నిజమైన చర్మకారుల సమస్యలను పరిష్కరించకుండా, శిక్షణ పొందిన వారందరినీ చర్మకారుల పేరుతో చూపిస్తూ ప్రజలను తమ వెంట తిప్పుకునే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు. నిజంగా దళితుల అభ్యున్నతే లక్ష్యమైతే, రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ప్రతి దళిత విద్యార్థికి అంబేద్కర్ అభ్యాసం అందేలా ప్రభుత్వం చర్యలు తీసు కోవాలని, ఇందుకోసం రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. దళితుల పేరును రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం మానేసి, వారి విద్య, ఉపాధి, గృహ స్థలాలు, సంక్షేమ పథకాల అమలుపై చిత్తశుద్ధితో



పోరాడాలని స్థానిక దళితులు స్పష్టం చేశారు. పాత కొత్తగూడెం ఎస్సీ కాలనీలోని ఇందిరమ్మ ఇల్లులు శాంక్షన్ అయి మొదటి బిల్లులు ఇంతవరకు పడలేదని అక్కడ ఉన్న లబ్ధిదారులు కలెక్టర్ విజ్ఞప్తి చేస్తున్నారు

# బ్లాక్ మనీ పేరుతో మోసం

**- నిందితుడు అరెస్ట్**

**- బ్లాక్ పేపర్లు రసాయనాలు స్వాధీనం**




**అశ్వారావుపేట, ఆగస్టు 4(మనం న్యూస్ ) :** బ్లాక్ మనీ పేరుతో అమాయకులను మోసం చేస్తున్న పత్తిపాటి ప్రేమ్ చందు అనే నిందితున్ని అశ్వరావుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం నాడు అశ్వరావుపేట సిఐ కార్యాలయంలో డిఎస్పి ఆర్ సతీష్ కుమార్ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. బ్లాక్ పేపర్లు లను ప్రత్యేక రసాయన ద్రావణంతో ముంచితే రు.500 నోట్లు గా మారతాయని నమ్మించి 11 లక్షలు తీసుకున్నట్లు తేలింది. రసాయనాల కొనుగోలు పేరుతో మరో రెండు లక్షలు తీసుకొని అశ్వారావుపేట కు చెందిన ముందు బాబును మోసం చేసి న్నట్లు ఒప్పుకున్నాడు. గతంలో ఇలాంటి మోసాలకు పాల్పడినట్లు పాల్వంచ డిఎస్పి సతీష్ కుమార్ వెల్లడించారు. మోటార్ సైకిళ్ళు దొంగతనం ఇతర కేసుల్లో బాచుపల్లి రామచంద్రపురం కూకట్పల్లి పోలీస్ స్టేషన్లో నిందితునిగా ఉండి జైలుకు వెళ్లి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. నిందితుని దగ్గర 500 నోట్లు బ్లాక్ పేపర్లు రసాయన సీసాలు స్వాధీనం చేసుకున్నారు నిందితుడిని అరెస్టు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇటువంటి మోసాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి డయల్ యువర్ ఎమ్మెల్యే




**దమ్మపేట, ఆగస్టు 04 (మనం న్యూస్ ) :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, మంగళవారం నియోజకవర్గ పరిధిలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో వే టు న్యూస్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చరవాణి ద్వారా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులను వెంటనే అప్రమత్తం చేసి సత్వర పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ప్రజల సంక్షేమం నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధం కావాలి

***- ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయండి***



**సుజాతనగర్, ఆగస్టు 4 : (మనం న్యూస్)** : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 6 నుంచి 12 వరకు నిర్వహించే ప్రజా చైతన్య యాత్రను విజయవంతం చేయాలని కొత్తగూడెం నగర పాలక సంస్థ మేయర్ మూతి గణేష్ పిలుపునిచ్చారు. మంగళవారం సుజాతనగర్ మండల కేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో "బద్లావ్ జరూరీ హై.. మార్పు కావాలి" వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కుమారి హనుమంతరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్య దస్రు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు తాళ్ల వెంకటేశ్వరరావు, మండల సహాయ కార్యదర్శి తాళ్లూరు ధర్మరావు, నాయకులు బొడ్డు కేశవరావు, వీర్ల దుర్గాప్రసాద్, గడ్డం రాజేందర్, బండి రమేష్ కృష్ణ, దండి నర్సింహారావు, దండు నాగేశ్వరరావు, మండే నాగేశ్వరరావు, వెంకన్న, లింగేష్, కిలారి రామచంద్రరావుతో పాటు సీపీఐ నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం.



# భద్రాచలం

భద్రాచలం - దుమ్ముగూడెం

## స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీజేపీ భద్రాచలం మండల కమిటీ సమావేశం



భద్రాచలం, ఆగస్టు 4( మనం న్యూస్ ): భారతీయ జనతా పార్టీ భద్రాచలం మండల కమిటీ సమావేశం స్థానిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుంజా ధర్మ నివాసంలో, మండల అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశానికి మండల ఇన్‌చార్జ్ తాటిపాముల ఐలయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో భద్రాచలం పట్టణంలోని స్థానిక సమస్యలపై చర్చించి, ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ఉద్యమాత్మకంగా పోరాడాలని నిర్ణయించారు. అనంతరం నాయకులు అశోక్‌నగర్ కాలనీ, బస్ స్టేషన్ ఎదురుగా ఉన్న మెడిలైఫ్ ఆసుపత్రి పరిసర ప్రాంతాలను సందర్శించి దెబ్బతిన్న రహదారులు, డ్రైనేజీ, సైడ్ కాలువల సమస్యలను పరిశీలించారు. తక్షణమే రోడ్లు, డ్రైనేజీ, సైడ్ కాలువల నిర్మాణ పనులు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుంజా సంతోష్, ములిశెట్టి రామ్మోహన్ రావు, ఆవుల సుబ్బారావు, గోడ సత్యనారాయణ, పి.సి. కేశవ్, ముత్యాల చంద్రశేఖర్, సిహెచ్. వెంకన్న, దేవరపల్లి వెంకటేశ్వర్లు, షేర్ శ్రీనివాస్, గుమ్మాల వెంకటేశ్వర్లు, అన్నం సాయి లక్ష్మణ్, ములిశెట్టి నిఖిల్, జంపాల ప్రభాకర్, గంగులకుర్తి రామాచారి, అన్నం హరీష్, కెల్లా అప్పారావు, బి.ఎస్. నారాయణ, కే. రామలింగేశ్వరరావు, గార్లపాటి శ్రీను పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్లను పూర్తిగా రద్దు చేయాలి

### – దేశ ప్రయోజనాలకు విరుద్ధమైన వాణిజ్య ఒప్పందాలను ఉపసంహరించుకోవాలి

### – 10న "జైల్ భరో" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



భద్రాచలం, ఆగస్టు 4( మనం న్యూస్ ): కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్న నాలుగు లేబర్ కోడ్లను, వాటికి సంబంధించిన అన్ని నిబంధనలను పూర్తిగా రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎలమంచి రవికుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కొలగాని బ్రహ్మాచారి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం స్వామి డిమాండ్ చేశారు. భద్రాచలం పట్టణంలో యర్రంశెట్టి వెంకట రామారావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులోవారు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కార్మికులు దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న అనేక కార్మిక హక్కులను నాలుగు లేబర్ కోడ్ల పేరుతో కేంద్ర ప్రభుత్వం బలహీనపరుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పని గంటలు, కార్మిక సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కు, సమ్మె చేసే హక్కు వంటి మౌలిక హక్కులపై ఈ కోడ్లు తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నారు. కార్మికుల ప్రయోజనాలను పక్కనబెట్టి పెద్ద కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా రూపొందించిన ఈ చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా, దేశ ఆర్థిక వ్యవస్థ, రైతాంగం, చిన్న పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలు మరియు ప్రజల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం చూపే దేశ ప్రయోజనాలకు విరుద్ధమైన వాణిజ్య ఒప్పందాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరారు. విదేశీ పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చే విధానాలకు బదులుగా దేశీయ ఉత్పత్తి, వ్యవసాయం, కార్మిక రంగాలను పరిరక్షించే విధానాలను అమలు చేయాలని అన్నారు. పెరుగుతున్న ధరలను అదుపులోకి తీసుకువచ్చి నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాలని, కార్మికులకు సామాజిక భద్రత, కనీస వేతనాల అమలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి సంక్షేమ పథకాలను పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న నిర్వహించనున్న "జైల్ భరో" కార్యక్రమాన్ని కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ప్రజల హక్కుల పరిరక్షణ, కార్మిక చట్టాల రక్షణ, రైతాంగ ప్రయోజనాల సాధన కోసం జరిగే ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను విరమించుకుని కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వర్గాల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## గడువులోగా ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయాలి

### – ఆలయ ప్రాచీనతకు భంగం కలగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలి

### – భక్తులకు మెరుగైన దర్శన, మౌలిక వసతులు కల్పించేలా పనులు వేగవంతం చేయాలి

### – కలెక్టర్ అంకిత్

### – పనులు పరిశీలన



భద్రాచలం ,ఆగస్టు 4 (మనం న్యూస్) వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో చేపడుతున్న పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తో కలసి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ముందుగా జిల్లా కలెక్టర్ ఉత్తర ద్వార దర్శనం వద్ద జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులకు సంబంధించిన డ్రాయింగ్స్‌ను పరిశీలిస్తూ నిర్మాణాల రూపకల్పన, పనుల నాణ్యత, అమలు తీరు, పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉత్తర ద్వార దర్శనం నిర్మాణ పనులను ముక్కోటి ఏకాదశి నాటికి తప్పనిసరిగా పూర్తిచేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బంది, యంత్రాలను వినియోగించి పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు.అనంతరం తూర్పు వైపు నుంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణ మార్గంలో పర్యటిస్తూ తూర్పు, దక్షిణ, పడమర వైపులా కొనసాగుతున్న పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రతి నిర్మాణానికి సంబంధించిన డ్రాయింగ్స్‌ను పరిశీలిస్తూ అధికారులు, ఇంజనీర్లను పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాల రూపకల్పనలో ఆలయ ప్రాచీనతకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని, నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రతి పనిని ప్రణాళికాబద్ధంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.ఆలయం నుంచి గోదావరి ఘాట్ వరకు ఉన్న మార్గాన్ని జిల్లా కలెక్టర్ కాలినడకన పరిశీలించారు. గోదావరి పుష్కరాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు ఈ మార్గంలో రాకపోకలు సాగించే నేపథ్యంలో రోడ్ల విస్తరణ, పాదచారుల మార్గాలు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యం, విద్యుత్ వెలుగులు, భద్రతా ఏర్పాట్లు, సూచిక బోర్డులు, ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఆలయం నుంచి ఘాట్ వరకు రోడ్ల విస్తరణ పనులను పుష్కరాల నాటికి పూర్తిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు.అనంతరం చిత్రకూట మండపం వద్ద కొనసాగుతున్న తొలగింపు పనులను పరిశీలించారు. మండపంలోని పురాతన రాతి స్తంభాలు, శిల్ప సంపదకు ఎలాంటి నష్టం కలగకుండా శాస్త్రీయ పద్ధతిలో అత్యంత జాగ్రత్తగా తొలగింపు ప్రక్రియ చేపడుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రాతి స్తంభాలను గుర్తింపు సంఖ్యలతో నమోదు చేసి నిపుణుల పర్యవేక్షణలో భద్రపరుస్తున్నట్లు తెలిపారు. ఈ తొలగింపు ప్రక్రియను మూడు రోజుల్లో పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు. పురాతన వారసత్వ సంపదకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రతి పనిని అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.అనంతరం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి చేరుకున్న జిల్లా కలెక్టర్‌కు ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. వేద పండితులు వేదాశీర్వచనం అందించగా, జిల్లా కలెక్టర్ శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ పునర్నిర్మాణ, అభివృద్ధి పనులకు ఈ ఏడాది మార్చి నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగినట్లు తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార ఒ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షించేందుకు ఈ పర్యటన చేపట్టినట్లు తెలిపారు .వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నాటికి ఆలయ అభివృద్ధి పనులను పూర్తిచేసే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోందన్నారు. అన్ని పనులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా అవసరమైన పరిపాలనా, సాంకేతిక, ఆర్థిక చర్యలను సమన్వయంతో అమలు చేస్తున్నామని తెలిపారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా మరింత వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.ఆలయ అభివృద్ధి పనుల పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు రోడ్లు ఒ భవనాల శాఖ నుంచి ప్రత్యేక అధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాచీనత, ఆధ్యాత్మిక విశిష్టతకు భంగం కలగకుండా నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. భక్తులకు మెరుగైన దర్శన సౌకర్యాలు, విశాలమైన రాకపోకల మార్గాలు, ఆధునిక మౌలిక వసతులు కల్పించి గోదావరి పుష్కరాల నాటికి అన్ని ప్రధాన పనులను పూర్తిచేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో భద్రాచలం తాసిల్దార్ రవికుమార్, పంచాయతీ ఈవో, ఆర్ అండ్ బి శాఖ ఈఈ నాగేశ్వరరావు, దేవాదాయ శాఖ అధికారులు, రోడ్లు ఒ భవనాల శాఖ ఇంజినీర్లు, సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వర్షాభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

### – అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తమశీల్దార్‌కి వినతిపత్రం అందజేత



దుమ్ముగూడెం ఆగస్టు 4 (మనం న్యూస్): వర్షాభావ పరిస్థితులలో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం డిమాండ్ చేసింది. రైతాంగ సమస్యలపై మంగళవారం దుమ్ముగూడెం తాసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్ భరణి బాబుకి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఐక్య రైతు సంఘం జిల్లా నాయకులు ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం భద్రాచలం డివిజన్ కార్యదర్శి దాసరి సాయన్న, మీడియం. ముద్ద రాజు లు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో వర్షాలు సజావుగా సకాలంలో ఉంటాయన్న వాతావరణ నిపుణులు మాటలతో ప్రజలంతా వ్యవసాయ సాగుకు సిద్ధపడి విత్తనాలు వేశారని అక్కడక్కడ చిరుజల్లులు మినహా భారీ వర్షా లేక మొలకెత్తిన పత్తి మొక్కలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని నష్టపోయిన రైతులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని అన్నారు. ప్రత్యామ్నాయ పంటలను సాగుకు ఉపయోగపడే స్వల్ప కాలిక పంట విత్తనాలు ఉచితంగా సకాలంలో క్షేత్రస్థాయిలో అందించాలని,రైతుల రుణాలు పూర్తిగా ఒకేసారి రుణమాఫీ చేయాలని, కొత్తగా వడ్డీ లేని పంట రుణాలు ఇవ్వాలని,పంట బీమా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాలలో పశువులకు పశుగ్రాసం మంచినీటి సరఫరా చేయాలని, తాలి పేరు కాలువకు రిపేరు చేసి తక్షణమే సాగునీరు అందించాలని అన్నారు. ఎల్ నీలో ప్రభావంతో ఆశించినంత వర్షాలు పడకపోవడంతో వ్యవసాయ పనులు నిలిచిపోయాయని ఈ కారణంగా వ్యవసాయ కూలీలకు కూలి పనులు దొరకడం లేదని వ్యవసాయ కూలీలకు గ్రామీణ ఉపాధి పథకం ద్వారా 200 రోజులు పని దినాలు కల్పించాలని రోజుకి 700 రూపాయలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి ఏఐకెఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు సోంది మల్లు దొర మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం డివిజన్ కార్యదర్శి ప్రణయ్ చందు గంగమ్మ పాల్గొన్నారు.

# రక్తహీనత నివారణకు పౌష్టికాహారమే మార్గం

**- క్షేత్రస్దాయి పర్యటనలు తప్పనిసరిగా చేయాలి**
**- వలసపై దృష్టి సారించాలి**
**- ఆశాల సమావేశంలో**
**డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో శ్రీధర్**







**చర్ల, ఆగస్ట్ 4 (మనం న్యూ :** రక్తహీనత నివారణపై అవగాహనపై ఆశా కార్యకర్తలకు భద్రాచలం డిప్యూటీ డిఎం అండ్ హెచ్ వో డాక్టర్ శ్రీదర్ అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం చర్ల ప్రాదమిక ఆరోగ్య కేంద్రలో జరిగిన ఆశాడే లో పాల్గొన్న ఆయన కార్యకర్తలను ఉద్దేసించి మాట్లాడారు. యుక్త వయస్సులో వచ్చే రక్తహీనత గురించి, దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పౌష్టికాహారం, ఐరన్ ఫోలిల్ మాత్రల వాడకం ద్వారా రక్తహీనతను అదిగమించవచ్చని తెలిపారు. ఆశా కార్యకర్తలు, సిబ్బంది ఈ విషయాన్ని గమనించి రక్తహీనత ఉన్నవారిని గుర్తించి వారికి తగు జాగ్రత్త తెలియచెప్పాలని విజ్ఞప్తి చేసారు. వర్షాలు కురుస్తున్నందున గ్రామాలు చిత్తడిగా మారి పారిశుధ్యం లోపించి సీజనల్ వ్యాదులు ప్రభలే అవకాశాలు ఉన్నాయన్నారు.ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఆదేసించారు. తద్వారా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్ధాయిలో క్రమం తప్పకుండా పర్యటనలు చేయాలని అన్నారు.డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలు ప్రభల కుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి జ్వర కేసును నమోదు చేసి ఫాలో అప్ చేయాలని సూచించారు.ప్రతి జ్వర కేసుకు మలేరియా ఆర్ డి టి పరీక్ష తప్పనిసరిగా చేయాలని ఆదేసించారు. గ్రామాల నుండి ఛత్తీస్‌గఢ్ వెళ్లి తిరిగి వచ్చిన వ్యక్తుల వివరాలు సేకరించి, వారిని నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఇటువంటి చర్యలు మలేరియా వ్యాప్తి నిరోధానికి చాలా ముఖ్యమని తెలిపారు. వర్షాలు, వరదల కారణంగా వాగులు పొంగడంతో పాటు గోదావరి ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందునగ్రామాలలోని గర్భిణీ స్త్రీలందరి సమాచారంతో పాటు ముఖ్యంగా కాన్పు తేదీ దగ్గరగా ఉన్న వారి జాబితా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కాన్పు తేదీ దగ్గరగా ఉన్న గర్భిణీలను ముందుగానే పి హెచ్ సి, సి హెచ్ సి, ఏరియా హాస్పిటల్ కు రిఫర్ చేయాలని అన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే ఆశా కార్యకర్త ఈడిడి ఉన్న తల్లితో పాటు ఆసుపత్రికి వెళ్లడానికి సిద్ధంగా ఉండాలని విజ్ఞప్తి చేసారు. వ్యాదులు ప్రబల కుండా గ్రామాలలో విరివిగా వైద్య శిబిరాలను నిర్వహించాలని సూచించారు. అనంతరం వైద్యశాల రికార్డులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ప్రాదమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హారిక, డిపిఎంవో పాయం శ్రీను, హెల్త్ సూపర్ వైజర్ పి కృష్ణయ్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు

**- రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల హామీలను అమలు చేయాలి**
**- 6 నుండి జిల్లా వ్యాప్తంగాప్రజా చైతన్య యాత్రలు**
**- సెప్టెంబర్ ఒకటిన చలో ఢిల్లీని జయప్రదం చేయండి**
**- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి**




**చర్ల, ఆగస్ట్ 4 (మనం న్యూస్) :**

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విదానాలకు వ్యతిరేకంగా పోరాటాలను నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, భద్రాచలం డివిజన్ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో కల్లూరి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రధానంగా కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చడం, పేద ప్రజలకు నష్టం చేయడం, వ్యవసాయ సంక్షోభాన్ని సృష్టించి రైతులను ఆత్మహత్యలకు పురిగొల్పటం, ధరలను పెంచి నిత్యవసరాలపై భారం మోపడం,కార్మికుల హక్కులను హరించి వేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. విద్య, ఆరోగ్యం ప్రవేటికరణ, ఆదివాసులపై దాడులు నిర్వహిస్తూ ఆంక్షలు విధించడం వంటి చర్యలతో రాజ్యాంగ విలువలను మంటగలుపుతున్నారని విమర్శించారు. మోడీ ప్రభుత్వ విదానాలతో ప్రజాస్వామ్యానికి పెనుముప్పు కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేసారు. ఇటువంటి విధానాలను కొనసాగిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై పోరాటాల నిర్వహించాలని విజ్ఞప్తి చేసారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలను అమలు పరచాలని డిమాండ్ చేస్తారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 6 నుంచి 12 వరకు నిర్వహించనున్న ప్రజా చైతన్య యాత్రలను విజయవంతం చేయాలని కోరారు.సెప్టెంబరు 1 న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల ఏడో తేదీన చర్లలో జరిగే ప్రజా చైతన్య యాత్రకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీతమ్మ రామ ప్రాజెక్టు సాగునీటిని జిల్లా ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. గిరిజనుల ఆధీనంలో ఉన్న పోడుభూములకు పట్టాలను మంజూరు చేయాలని, పేదలకు ఇందిరమ్మ ఇల్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దుమ్ముగూడెం మండలం ప్రగల్లపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి గిరిజనుల భూములకు సాగనీటిని అందించాలని కోరారు. ఆంధ్రలో విలీనం చేసిన ఐదు గ్రామపంచాయతీ లను భద్రాచలంలో కలపాలని విజ్ఞప్తి చేశారు. భద్రాచలం గోదావరి కారకట్టను పొడిగించి పట్టణ వాసులను ముంపు నుండి కాపాడాలని కోరారు. ఏరియా వైద్యశాలలో వైద్యులు, సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. చర్ల మండలంలోని వద్దిపేట గ్రామం వద్ద చెక్ డామ్ నిర్మించి 22 గిరిజన గ్రామాల ప్రజలకు సాగునీటిని అందించాలని, తాలిపేరు రిజర్వాయర్ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి చెలిమల, తిప్పాపురం, బత్తెనపల్లి తదితర గ్రామాల రైతులకు సాగునీటిని అందించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు కోటి ముత్యాలరావు, చల్లా లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులు కోడిరెక్కల, కల్లూరి సీతారాములు, ఆంద్రు వామన రావు, కట్ట ముత్తయ్య, కట్టం నాగేశ్వరరావు, ఉప్పులూరి నాగరాజు, తోట శ్రీను, కల్లూరి సమ్మయ్య, సోడి వెంకటేశ్వర్లు, పర్శిక వెంకటేశ్వర్లు, బొగ్గుల జోగయ్య, చెన్నం సాంబశివరావు, నరసింహారావు, భద్రం, కన్నయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మనం



# చర్ల

**చర్ల మేజర్ పంచాయతీ - చర్ల మండలం**

## శాంకాంభరీ దేవి అలంకరణలో వాసవి అమ్మవారు



**చర్ల, ఆగస్ట్ 4 (మనం న్యూస్) :** చర్లలోని త్రికూట దేవాలయంలో కొలువైఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు శాకాంభరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ మాసం సందర్భంగా భక్తులు వివిద రకాల కూరగాయలు, ఆకు కూరలను దండలుగా మార్చి అమ్మవారికి అలంకరించారు. ఆలయ అర్చకులు హరినాధ శర్మ ఆద్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారిని కనులారా తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్ధప్రసాదాలను స్వీకరించారు. తదనంతరం మంగళవారం రాత్రి అమ్మవారికి అలంకరించిన కూరగాయలతో కదంబ అన్నప్రసాదం చేసి భక్తులకు వడ్డింపచేసారు. ఈ కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని తమ భక్తిశ్రద్ధలను చాటుకున్నారు.


## టిబి వ్యాధి గ్రస్తుడిని దత్తత తీసుకున్న డిప్యూటీ డిఎం అండ్ హెచ్ వో

**- ప్రదాని మోడీ పిలుపుకు స్పందించిన అధికారి**



**చర్ల ఆగస్ట్ 4 (మనం న్యూస్)** : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిక్షయ్ మిత్ర కార్యక్రమంలో భాగంగా చర్ల ప్రాదమిక ఆరోగ్య కేంద్రం కొయ్యూరు కు చెందిన ఒక టీబీ వ్యాధిగ్రస్తురాలిని భద్రాచలం డిప్యూటీ డిఎం అండ్ హెచ్ వో డాక్టర్ శ్రీదర్ దత్తత తీసుకున్నారు. ఆమె వైద్యం తీసుకునే ఆరు నెలల పాటు బాధితురాలికి అవసరమైన పౌష్టికాహారాన్ని తాను స్వయంగా అందిస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతి ఉద్యోగి ఒక టీబీ పేషెంట్ ను దత్తత తీసుకోవాలని ఇచ్చిన పిలుపు తనను ఎంతగానో ప్రభావితం చేసిందన్నారు. ప్రతి రోజూ మనం ఎన్నో ఖర్చులు పెడుతుంటామని, ఒక టీబీ రోగికి పోషకాహారం కోసం పెట్టే ఖర్చు అందులో చాలా చిన్నదే అయినప్పటికీ దాని వల్ల వచ్చే సంతృప్తి మాటల్లో చెప్పలేనిదన్నారు. టీబీ పేషెంట్లలో చాలా మంది పేదరికం కారణంగా సరైన ఆహారం తీసుకోలేకపోతున్నారని, పని చేసుకోవడానికి కూడా వారికి శక్తి ఉండదని వారికి వ్యాది నయం కావాలంటే మందులతో పాటు సరైన బలవర్ధకమైన ఆహారం కూడా తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి టీబీ కేసులను దత్తత తీసుకుని పోషకాహారం అందిస్తే త్వరలోనే మన దేశం నుండి టీబీని పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు. డాక్టర్ శ్రీదర్ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్దానికులు హర్షం వ్యక్తం చేశారు.

## సుక్మా జిల్లాలో మావోయిస్టు డంప్ స్వాధీనం



**చర్ల, ఆగస్ట్ 4 (మనం న్యూస్) :** ఛత్తీస్‌గఢ్ లోని సుక్మా జిల్లాలో మంగళవారం భద్రతా బలగాలు మావోయిస్ట్ డంప్ ను స్వాధీన పరచుకున్నారు. బెజ్జీ పోలీస్ స్టేషన్ పరిదిలోని బోధరాజ్ పాదర్ అడవులలో జరిపిన గాలింపు చర్యలలో 315-బోర్ బోల్ట్-యాక్షన్ రైఫిళ్లు, భారీ పరిమాణంలో సజీవ తూటాలు దాచిపెట్టిన ఒక నక్సలైట్ డంప్‌ను కనుగొన్నారు. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మయాంక్ గుర్జర్ ఆదేశాల మేరకు ఏఎస్పీ (ఆప్స్) రోహిత్ షా మార్గదర్శకత్వంలో మావోయిస్ట్ నిర్మూలన కార్యక్రమం జరుగుతోంది. మావోయిస్ట్ కార్యకలాపాలపై వచ్చిన నివేదికల మేరకు ఆగస్టు 3న, బెజ్జి పోలీస్ స్టేషన్ మరియు సీఆర్పీఎఫ్ 50వ బెటాలియన్‌కు చెందిన సంయుక్త బృందాన్ని బోద్రజ్‌పదర్ అడవికి పంపారు. క్షుణ్ణంగా గాలించిన అనంతరం, నక్సలైట్ల డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. 315 బోర్ బోల్ట్ యాక్షన్ రైఫిల్ ఒకటి,7.62ఐ39 మిమీకి చెందిన 47 లైవ్ కాట్రిడ్జ్‌లు,7.62ఐ51 మిమీకి చెందిన 2 లైవ్ కాట్రిడ్జ్‌లు,ఒక అల్యూమినియం కంటైనర్ లను స్వాదీన పరుచుకున్నారు. గాలింపు చర్యలు విజయవంతంగా పూర్తయిన అనంతరం సంయుక్త బృందం క్షేమంగా శిబిరానికి తిరిగి వచ్చింది. జిల్లాలో మావోయిస్ట్ కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతుందని ఎస్ పి స్పష్టం చేసారు.

మనం

పినపాక
మణుగూరు - అశ్వాపురం - పినపాక - కరకగూడెం - ఆళ్లపల్లి - గుండాల- బూర్గంపాడు

# సేవ్ మణుగూరు పోరాట ఫలితమే పీకే ఓసి 2 సైడ్ బ్లాక్

### - బ్రాంచ్ కార్యదర్శి వై. రాంగోపాల్

### - ఏఐటియుసి గుర్తింపు కార్మిక సంఘం ఆధ్వర్యంలో పికె ఓ సి 2 లో స్వీట్స్ పంపిణీ



**మణుగూరు, ఆగస్టు 4 (మనం న్యూస్):** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ సేవ్ మణుగూరు పోరాట ఫలితం గా నే మణుగూరు పీకే ఓసి 2 సైడ్ బ్లాక్ సింగరేణికి దక్కిందని అన్నారు. మణుగూరుకు భవిష్యత్తు లేదని మేనేజ్మెంట్ ప్రకటించిన నాటి నుండే బాధ్యతగల గుర్తింపు కార్మిక సంఘం గా పోరాటాలకు శ్రీకారం చుట్టామని అన్నారు.చెందిన మణుగూరు ప్రాంత భవిష్యత్తు అంధకారం అయ్యే ప్రమాదం ఉందని తలచి “” సేవ్ మణుగూరు” అనే నినాదంతో పోరాట కార్యక్రమాన్ని నిర్వహించామని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను, మేనేజ్మెంట్ కు పోరాటాల ద్వారా నిరసన ఫలితమే ఈ బ్లాక్ సింగరేణి దక్కిందని అన్నారు. ఏ పోరాటాలు చేయని వారు అధికారంలో ఉన్నవారు. సంస్థ అభివృద్ధిపై ఆలోచన లేనివారు నేడు మేమే సాధించామని గొప్పలు చెప్పుకోవడం, సోషల్ మీడియాలో ప్రచారాలు చేసుకోవడం సిగ్గుచేటని అన్నారు. టీబీజీకేఎస్,ఐ ఎన్ టి యు సి యూనియన్లకు ఈ విషయంలో అసలు మాట్లాడే అర్హత లేదని అన్నారు. మీడియాలో స్పందించడానికి భయపడిన వారు నేడు మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. కార్మిక వర్గం అంతా వాస్తవాలను గమనిస్తూనే ఉందని అన్నారు. ఎప్పటికైనా పోరాటాల ద్వారానే విజయం సాధ్యమవుతుందని సేవ్ మణుగూరు పోరాటం ద్వారా ఇది రుజువు అయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎం.వి.రాం నర్సయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మేకల ఈశ్వరరావు, పిట్ సెక్రెటరీలు శనిగరపు కుమారస్వామి, బి రవి కుమార్ , జి సుదీప్,జానకి ప్రసాద్, నేమాత్, నాగుల సతీష్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆడవారిని అడ్డుపెట్టుకొని కేసులు పెట్టడం నీచమైన సంస్కృతి

### - బిఆర్ఎస్ మండల అధ్యక్షులు తెల్లం భాస్కర్



**గుండాల,ఆగస్టు 04(మనం న్యూస్):** ఆడవారిని అడ్డుపెట్టుకొని కేసులు పెట్టడం నీచమైన సంస్కృతి అని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తెల్లం భాస్కర్,మండల నాయకులు గడ్డం వీరన్న అన్నారు.మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పినపాక మాజీ శాసనసభ్యులు రేగ కాంతారావు పై అక్రమ కేసు పెట్టడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. ఒక మహిళను అడ్డుపెట్టుకొని నీచ రాజకీయాలు చేస్తూ ఒక గిరిజన నాయకుడిపై తప్పుడు కేసులు బనాయించడం నీచ సంస్కృతి అని అన్నారు. భద్రాద్రి జిల్లాలో పినపాక నియోజకవర్గం లో రేగా కాంతారావు కు టిఆర్ఎస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూడలేకనే తప్పుడు కేసులలో ఇరికించాలని చూసి అబాస్ పాలవుతున్నారని అన్నారు. మండల నాయకుల నుండి రాష్ట్ర నాయకుల వరకు రోజు ఏదో ఒక చోట తప్పుడు కేసులలో బిఆర్ఎస్ పార్టీ నాయకులను ఇరికించాలని చూస్తున్నారని ఇలాంటి వాటికి భయపడే ప్రసక్తే లేదని అన్నారు.ఇప్పటికైనా తప్పుడు కేసులలో ఇరికించే సంస్కృతిని మానుకోవాలని అన్నారు.రానున్నది బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వమేనని తెలుసుకొని పార్టీ నాయకులను కేసుల్లో ఇరికించడం ద్వారా ప్రజల్లో తప్పుడు సంకేతం పంపాలని దురుద్దేశం ఉందని అర్థమవుతుందన్నారు ఇప్పటికైనా ఇలాంటి పనులు చేసేవారు మానుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో రైతు సమన్వాయ సమితి మాజీ అధ్యక్షులు మోకాళ్ళ వీరస్వామి,అధికార ప్రతినిధి టి రాము,ఎస్సీ సెల్ అధ్యక్షులు రాములు, ఎస్ టి సెల్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ,పార్టీ మాజీ సర్పంచ్ బుచ్చి రాములు, పార్టీ నాయకులు రాంబాబు,ప్రమోద్,రమేష్, కిరణ్,ఆగయ్య తదితరులు పాల్గొన్నారు

# ఓసి 2 డిప్ సైడ్ సింగరేణికి కేటాయింపుతో వేలాది మంది భద్రతకు భరోసా

### - పిట్ కమిటీ మీటింగ్ లో పాల్గొని కార్మికులతో కలిసి సంబరాలు జరిపిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు





**మణుగూరు, ఆగస్టు 4(మనం న్యూస్):** పికె ఓసి-2 డీప్ సైడ్ గనిని సింగరేణికి దక్కించేందుకు కార్మిక సంఘాలు, ప్రజాప్రతినిధులతో కలిసి నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి చేసిన కృషి ఫలించిందన్నారు. ఈ గని సింగరేణికి రావడం వల్ల సంస్థ మరింత బలోపేతం కావడంతో పాటు వేలాది మంది కార్మికుల ఉద్యోగ భద్రత, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,తుమ్మల నాగేశ్వరరావు వారికి పికె ఓసి-2 డీప్ సైడ్ గనిని సింగరేణికి కేటాయించడంలో అందించిన సహకారానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఐ ఎన్ టి యు సి నాయకులు, సింగరేణి కార్మికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సింగరేణి కార్మికులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించి, సింగరేణి పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, మణుగూరు ప్రాంత అభివృద్ధి కోసం ఆయన చేసిన విశేష కృషిని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా కార్మికుల పక్షాన నిలిచి సేవలు కొనసాగించాలని ఆకాంక్షించారు.కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రాజెక్టు క్యాంటీన్‌లో కార్మికులతో కలిసి టిఫిన్ చేస్తూ కార్మికుల సమస్యలు, సంక్షేమం, పని పరిస్థితులపై వారిని అడిగి తెలుసుకుని, వారి సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి నాయకులు, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సింగరేణి కార్మికులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆగస్టు 6 నుంచి కొత్త ఎరువుల బుకింగ్ విధానం అమలు

### ఎఫ్ఎఫ్డబ్ల్యూఎఫ్ఎస్ యాప్‌తో ఎరువుల విక్రయాల్లో పారదర్శకత యూరియాతో పాటు అన్ని ఎరువులకు ఒకే యాప్‌లో బుకింగ్ సౌకర్యం మణుగూరు డివిజన్ రైతులు కొత్త ఎరువుల యాప్‌ను వినియోగించాలి : ఏడీఏ తాతారావు



**మణుగూరు, ఆగస్టు 4 (మనం న్యూస్):** ఎరువుల బుకింగ్ కోసం కేంద్ర ప్రభుత్వం ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ అనే కొత్త ఎరువుల బుకింగ్ యాప్ ను ప్రవేశపెట్టిందని మణుగూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బి. తాతారావు తెలిపారు.ఈ విధానం ప్రకారం ఆగస్టు 6వ తేదీ నుండిఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతో పాటు రాష్ట్రంలోని మరో 10 జిల్లాల్లో యూరియా, డి.ఎ.పి, కాంప్లెక్స్, పొటాష్ తదితర అన్ని రకాల ఎరువుల విక్రయాలు ఈ నూతన యాప్ ద్వారా మాత్రమే అమ్మకాలు జరుగుతాయి.పాత బుకింగ్ యాప్ లో కేవలం యూరియా మాత్రమే లభించేదని ఈ కొత్త యాప్ లో యూరియా తో పాటుగా అన్ని కాంప్లెక్స్ డి ఏ పి తదితర ఎరువులన్నీ లభిస్తాయని తెలిపారు.ఈ నూతన విధానంలో ఎరువులు పొందాలంటే ఫార్మర్ ఐడి లేదా ఆధార్ కార్డు ఉంటే సరిపోతుంది ఆండ్రాయిడ్ మొబైల్ లో గూగుల్ ప్లే స్టోర్ నుండి ఎఫ్ ఎఫ్ డబ్ల్యు ఎఫ్ ఎస్ - ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలి, రాష్ట్రం ఎంపిక చేసుకొని, ఆధార్ నంబర్ లేదా ఫార్మర్ ఐడి నమోదు చేసి ఓటీపీ లేదా ఫేస్ రికగ్నిషన్ ద్వారా లాగిన్ అయిన అనంతరం భూమి వివరాలు చూపిస్తుంది , తదుపరి పంట వివరాలు నమోదు చేసాక పంటకు అవసరమైన ఎరువుల పరిమాణం చూపిస్తుందనీ,రైతుకు అవసరమైన ఎరువులను మాత్రమే ఎంపిక చేసుకొని బుక్ చేసుకునే సౌలభ్యం ఉందని,బుకింగ్ అయిన తర్వాత క్యూ ఆర్ కోడ్ బుకింగ్ ఐడి వస్తుందిఅని దాన్ని డౌన్లోడ్ చేసుకొని బుకింగ్ లో ఎంపిక చేసుకున్న డీలర్ వద్దకు వెళ్లి చూపించి ఎరువులను తీసుకోవాలని తెలిపారు .ఎరువులు అవసరం లేనిచో బుకింగ్ రద్దు చేసుకొనే అవకాశం కూడా ఉన్నదని,పాత యాప్ నందు బుకింగ్ రద్దు చేసుకొనే వెసులుబాటు లేదనీ తెలిపారు అలాగే రైతులు కావాల్సిన ఎరువులను నచ్చిన డీలర్ వద్ద బుక్ చేసుకోవచ్చుననీ తెలిపారు. మనం ఈ కొత్త విధానం వల్ల ఎరువుల సరఫరా పూర్తిగా పారదర్శకంగా జరుగుతుంది. రైతులకు సకాలంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎరువులు అందుతాయి.పాత విధానంలో క్యూ ఆర్ కోడ్ పద్ధతి లేదు కేవలం బుకింగ్ ఐడి మాత్రమే వస్తుంది కానీ ఈ కొత్త విధానంలో క్యూఆర్ కోడ్ తో పాటు బుకింగ్ ఐడి కూడా వస్తుంది 2 రోజుల లోపు రైతులు ఎప్పుడైనా రిటైలర్ వద్దకు వెళ్లి ఎరువులు పొందవచ్చునీ తెలిపారు పట్టాదార్ రైతుకు బదులుగా వారి రిప్రెసెంటేటివ్ ఎవరైనా కూడా వెళ్లి బుక్ చేసుకున్న ఎరువులను తెచ్చుకొనే వెసులుబాటు కలదనీ,కౌలు రైతులకు అదేవిధంగా భూమి పట్టా ఆన్లైన్లో లేని రైతులకు నాన్ డిఎస్ విధానం లో ఈ యాప్ ద్వారా వారికి అవసరమైన ఎరువులు పొందేందుకు కూడా అవకాశం కలదని ఆగస్ట్ 5 తారీకున పాత యాప్లో బుక్ చేసుకున్న రైతులకు కూడా 6 వ తేదీ నుంచి కొత్త యాప్ లో చూపిస్తుందని,కావున రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని మణుగూరు డివిజన్ పరిధిలోని పినపాక, అశ్వాపురం, కరకగూడెం, మణుగూరు, ఆళ్లపల్లి, గుండాల, బూర్గంపహాడ్ మండలాల రైతు సోదరులందరూ ఈ విషయాన్ని గమనించి, ఎలాంటి అసౌకర్యం ఎదురవకుండా ఈ కొత్త ఎరువుల బుకింగ్ యాప్ ను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు మరిన్ని వివరాలు కోసం వ్యవసాయ విస్తరణ అధికారులు మండల వ్యవసాయ అధికారులను సంప్రదించవచ్చుననీ తెలిపారు.

# ఉప్పొంగిన పుణ్యాపువాగు.. రాకపోకలకు తీవ్రతరాయం..

**ఆళ్లపల్లి, ఆగస్టు 4 (మనం న్యూస్):** మంగళవారం కురిసిన భారీ వర్షానికి పుణ్యాపు వాగు ఉప్పొంగి ప్రవహించడంతో ఆళ్లపల్లి మండలానికి రాకపోకలకు తీవ్రత అంతరాయం వాటిలింది. విద్యా, వైద్య, అత్యవసర పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వెళ్లేవారు చేసేదేమీ లేక సంపత్ నగర్ గంగారం మీదుగా ముత్యాలంపాడు నుండి జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి సంవత్సరం ఇదే విధంగా పుణ్యాపువాగు వల్ల ప్రయాణికులు తీసా ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ అధికారులు మాత్రం స్పందించడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పుణ్య వాగుపై ఐ లెవెల్ వంతెన ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు.



## మారెళ్లపాడు ప్రాజెక్టుతో రైతులకు శాశ్వత సాగునీటి భరోసా



**అశ్వాపురం, ఆగస్టు 4 ( మనం న్యూస్ ):** మండలంలోని సీతారామపురం వద్ద నిర్మితమవుతున్న మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రాజెక్టులో అత్యంత కీలకమైన బాహుబలి మోటార్ అమరిక పనులను మంగళవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మారెళ్లపాడు ఎత్తిపోతల పథకంతో స్థానిక రైతుల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతు అభివృద్ధి ద్వారానే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందించి అశ్వాపురం మండలాన్ని సస్యశ్యామలం చేస్తామని, రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా ఆరు గ్రామపంచాయతీల పరిధిలోని సుమారు 12 వేలకుపైగా ఎకరాలకు, కుడి కాలువ ద్వారా 10 చెరువులను నింపి దాదాపు 30 వేల ఎకరాలకు చివరి ఎకరం వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ టి. వెంకటేశ్వరరావు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ కె. శ్రీనివాస్, సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్లు, ఎంఈఐఎల్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, నాయకులు గాదె కేశవరెడ్డి, ఆవుల రవి, వేములపల్లి రమేష్, ఉసా అనిల్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భూరెడ్డి వెంకటరెడ్డి, తుక్కాని మధుసూదన్ రెడ్డి , గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## కరకగూడెం పీహెచ్‌సీలో ఆశా డే

### పాల్గొన్న డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్



**కరకగూడెం, ఆగస్టు 4 (మనం న్యూస్):** కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశాడి కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య సేవలు, రికార్డులు, నివేదికలు, వివిధ వార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో డీఎంహెచ్ఓ మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్ వంటి సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశం ఉన్నందున ఫీల్డ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రతిరోజూ ఇంటింటి సర్వే నిర్వహించాలని సూచించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని వెంటనే గుర్తించి అవసరమైన రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేయాలని, ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం "ఫ్రైడే డ్రై డే" కార్యక్రమాన్ని నిర్వహిస్తూ యాంటీ లార్వల్ చర్యలు చేపట్టి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే 14 సంవత్సరాల బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వెంటనే సేవలు అందించేలా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం అనంతరం డీఎంహెచ్ఓ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు మరింత కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవితేజ, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ , రాంప్రసాద్, పోలేబోయిన కృష్ణయ్య, ఏఎన్ఎం రమాదేవి, నరసింహారావు, సుజాత, విజయలక్ష్మి, సూపర్వైజర్లు, ఆశా కార్యకర్తలు, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

## అరుదైన మేక పిల్ల జననం..



**ఆళ్లపల్లి ఆగస్టు 4 (మనం న్యూస్):** ఆళ్లపల్లి మండలంలో ఓ రైతుకు చెందిన మేక అరుదైన మేక పిల్లకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని ఇప్పనపల్లి గ్రామానికి చెందిన ఉప్పలయ్య అనే రైతు కు చెందిన ఒక మేక భిన్నమైన పిల్లకు జన్మనిచ్చింది. ఆ మేక పిల్ల ఒకే తల ఉన్నప్పటికీ రెండు నాలుకలతో జన్మించింది. రెండు నాలుకలతో జన్మించడంతో తల్లిపాలను తాగలేక పోతోంది. కానీ ఉప్పలయ్య మాత్రం ఆ మేక పిల్లని గుండెలకు హత్తుకొని సిరంజి సహాయంతో క్రమం తప్పకుండా పాలుపడుతూ ఆ మేక పిల్లను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాడు. అది చూసిన జంతు ప్రేమికులు మండల ప్రజలు ఉప్పలయ్య మేక పిల్ల పై చూపిస్తున్న ప్రేమకు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## ఇసుక లారీల బీభత్సం

**- ట్రాఫిక్ అస్తవ్యస్తం.. ప్రజలు నరకయాతన**
**- చర్యలు లేకుంటే 500 మందితో ర్యాంపు ముట్టడిస్తాం**
**- రేణుక అక్షర మహిళా మండలి పూనం సరోజ హెచ్చరిక**





**మణుగూరు, ఆగస్టు4(మనం న్యూస్):** సాంబయ్యగూడెం, రామానుజవరం ఇసుక ర్యాంపుల నుంచి నిరంతరం రాకపోకలు సాగిస్తున్న భారీ ఇసుక లారీల కారణంగా మణుగూరు ప్రధాన రహదారిపై ట్రాఫిక్ పూర్తిగా అస్తవ్యస్తంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనం సరోజ మండిపడ్డారు. ఇసుక లారీల రాకపోకలను నియంత్రించడంలో సంబంధిత శాఖలు పూర్తిగా విఫలమయ్యాయని ఆమె ఆరోపించారు. ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో లారీల వరుసలతో వాహనాలు గంటల తరబడి నిలిచిపోతున్నాయని, ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, అత్యవసర సేవల కోసం వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె తెలిపారు. భారీ లారీల కారణంగా రోడ్డు ప్రమాదాల ముప్పు రోజురోజుకూ పెరుగుతోందని, పాదచారులు, ద్విచక్ర వాహనదారులు భయాందోళనల మధ్య ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రజల ప్రాణాల కంటే ఇసుక రవాణానే ముఖ్యమా?" అని ప్రశ్నించిన పూనం సరోజ, సాంబయ్యగూడెం, రామానుజవరం ఇసుక ర్యాంపులను వెంటనే నిలిపివేసి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. పోలీసులు, జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించాలి. లేకుంటే సుమారు 500 మందితో ఇసుక ర్యాంపును ముట్టడిస్తాం. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ర్యాంపు యాజమాన్యాన్ని ప్రజలే నిలదీస్తారు" అని ఆమె హెచ్చరించినట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం, రవాణా శాఖ, పోలీసు శాఖ, గనుల శాఖ అధికారులు సమన్వయంతో వెంటనే చర్యలు తీసుకుని ప్రజలకు ఉపశమనం కల్పించాలని, లేకపోతే ప్రజల తరఫున పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆమె స్పష్టం చేశారు. స్థానికుల భద్రత, ప్రజల సౌకర్యాలే ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యంగా ఉండాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా మండలి ఉపాధ్యక్షురాలు బొడ్డు సౌజన్య, ట్రెజరర్ ఎండి షబానా, జనరల్ సెక్రటరీ రెడ్డిబోయిన రేణుక, నాయకులు కోరి శ్యామల, దేరంగుల సుజాత, కన్నపురం వసంత, కన్నపురం శైలజ, బాడిశ పార్వతి, లక్కింశెట్టి హేమలత తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలకు పోరాటమే మార్గం

**- ఆగస్టు 10న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: నిమ్మల వెంకన్న**



**కరకగూడెం, ఆగస్టు 4(మనం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మల వెంకన్న పిలుపునిచ్చారు. ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మండల కేంద్రంలో కార్మిక సంఘం, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకుడు పద్దం గణేష్ అధ్యక్షతన నిర్వహించిన మండల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తూ ప్రజా సంపదను కార్పొరేట్ సంస్థల చేతుల్లో పెడుతోందని విమర్శించారు. కార్మిక చట్టాల్లో మార్పుల వల్ల ఎనిమిది గంటల పని హక్కు, ఉద్యోగ భద్రత, కనీస వేతనం, కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు బలహీనపడిందని ఆరోపించారు. రైతులు పండించిన పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కల్పించాలని దేశవ్యాప్తంగా డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల వల్ల దేశీయ రైతాంగం నష్టపోతోందని పేర్కొంటూ, పత్తి, మొక్కజొన్న, పాల ఉత్పత్తులు, కోడి కాళ్ల దిగుమతులకు సంబంధించిన ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరుస్తూ గ్రామీణ పేదల జీవనోపాధిపై దెబ్బతీస్తున్నారని విమర్శించారు. నూతన విత్తన చట్టం, నూతన విద్యుత్ చట్టం సహా ప్రజా వ్యతిరేక చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ చట్టాల వల్ల రైతులు, కార్మికులు, సామాన్య ప్రజలపై అదనపు భారాలు పడతాయని అన్నారు. భారత్ విడిచి పో ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న నిర్వహించే జైలు భరో కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించాలని నిమ్మల వెంకన్న పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కొమరం కాంతారావు, మాదాసు అఖిల్, పద్దం గణేష్, లలిత, సావిత్రి, రమేష్, కణీతి రాజు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌లు అప్రమత్తంగా ఉండాలి



**అశ్వాపురం, ఆగస్టు 4 ( మనం న్యూస్ ):** వాట్సాప్ గ్రూపుల్లో సభ్యులు చేసే ప్రతి పోస్టుపై గ్రూప్ అడ్మిన్‌లు అప్రమత్తంగా ఉండాలని అశ్వాపురం సీఐ ఎల్లయ్య సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గ్రూపులో ఎవరైనా సభ్యులు అభ్యంతరకరమైన, అసభ్యకరమైన, విద్వేషపూరితమైన, చట్టవిరుద్ధమైన పోస్టులు, సందేశాలు, ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తే వాటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే తొలగించే చర్యలు తీసుకోవాలని తెలిపారు. అటువంటి పోస్టులు చేసే సభ్యులను వెంటనే గ్రూపు నుంచి తొలగించాలని, అవసరమైతే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని గ్రూప్ అడ్మిన్‌లకు సూచించారు. సోషల్ మీడియా వేదికలను బాధ్యతాయుతంగా వినియోగించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని, చట్టాన్ని ఉల్లంఘించే పోస్టులు సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు సోషల్ మీడియాలో సమాచారాన్ని షేర్ చేసే ముందు దాని నిజానిజాలను నిర్ధారించుకోవాలని, పుకార్లు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, మత, కుల విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు, అసత్య ప్రచారాలకు దూరంగా ఉండాలని సీఐ ఎల్లయ్య సూచించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలను ప్రోత్సహించే లేదా అభ్యంతరకర పోస్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియా ప్రజలకు ఉపయోగపడే వేదిక కావాలని, అపోహలు, అసత్య ప్రచారం, అభ్యంతరకర పోస్టులకు కాదని సీఐ స్పష్టం చేశారు.

మనం



# ఇల్లందు

ఇల్లందు మున్సిపాలిటీ - ఇల్లందు మండలం - టేకులపల్లి - కామేపల్లి

# మీ ఇంటికి. మీ ఎమ్మెల్యే..

- బాలాజీ నగర్ గ్రామ పంచాయితీలో ఎమ్మెల్యే కోరం పర్యటన....
- లబ్ధిధారుల ఇంటికి వెళ్ళి స్వయంగా సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణి చేసిన ఎమ్మెల్యే....
-ప్రజా ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేదలకు అండగా నిలువాలని ప్రభుత్వం పని చేస్తోంది...
-ఎమ్మెల్యే కనకయ్య





**ఇల్లందు, ఆగస్టు 04 (మనం న్యూస్) :** ఇల్లందు మండలం బాలజీనగర్ నగర్ గ్రామపంచాయితి లో ఎమ్మెల్యేకోరం కనకయ్య, పర్యటించారు..పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి సహాయనిధి పేరిట మంజూరు కాబడిన చెక్కులను లబ్ధిధారుల ఇంటికి స్వయంగావెళ్ళిచెక్కులుఅందచేసారు....ప్రజా ప్రభుత్వం లిఅర్హులైన పేదల గడపకు, ప్రతి పథకం అందించాలని,రాష్ట ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులలో ఉన్నా పేదలందరికి అండగా నిలువాలనే ఉద్ధేశంతో సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణి చేస్తుంది అని గుర్తు చేశారు....ఈ కార్యక్రమంలో ఇల్లందు మండల కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు మండల రాంమహేష్, సర్పంచుల సంఘం గౌరవ అధ్యక్షురాలు, స్ధానిక సర్పంచ్ పాయం స్వాతి,దిశకమిటి సభ్యురాలు, సర్పంచ్ బానోత్ శారద, మాజీ మండల కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు పులిసైదులు,సర్పంచ్ ఈసం బాలక్రిష్ణ, నా యకులు కాకటి భార్గవ్,కల్తీ పద్మ,బాలాజీ నగర్ గ్రామ కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గోన్నారు. ..ఇల్లందు మండలంలో కాంగ్రెస్ నేతలపర్యటన.... మామిడిగూడెం, కొమరారం, పోలారం, పోచారంతండా, మాణిక్యారం,రెపల్లెవాడ,చల్లసముద్రం,సుభాష్ నగర్,పుబెల్లి గ్రామాల సిఎంఆర్ఎఫ్ లబ్ధిధారుల ఇంటికి కాంగ్రెస్ నేతలు...ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఆదేశానుసారం లబ్ధిధారులకు చెక్కులు అందచేత... ఇల్లందు మండలంలోని మామిడిగూడెం, కొమరారం,పోలారం, పోచారంతండా, మాణిక్యారం,రెపల్లెవాడ, చల్లసముద్రం,సుభాష్ నగర్,పుబెల్లి గ్రామాలకు చెందిన ప్రజానికం వైద్యం నిమిత్తం ఖర్చు చేసిన ధనం మరల తిరిగి ముఖ్యమంత్రి సహాయనిధి పేరిట అందచేసే సిఎంఆర్ఎఫ్ చెక్కులను వ్యవసాయ సీజన్ కావడంతో ప్రజానికానికి ఇబ్బంది కలిగించకోడదు అనే ఉద్ధేశంతో ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశానుసారం లబ్ధిధారుల ఇంటికి వెళ్ళి చెక్కులను పంపిణి చేసిన ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు,ఇల్లందు మండలం కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు మండల రాంమహేష్ ,వారి వెంట డిసిసిబి డైరెక్టర్ జనగం కొటేశ్వరరావు, దిశకమిటి సభ్యురాలు, సర్పంచ్ బానోత్ శారద,సర్పంచుల సంఘం గౌరవ అధ్యక్షురాలు పాయం స్వాతి,జిల్లా కాంగ్రెస్ కమిటి సభ్యులు వాంకుడోత్ సతీష్,మామిడిగూడెం సర్పంచ్ ఈసం బాలక్రిష్ణ, పోచారం తండా సర్పంచ్ వాకుండోత్ భారతి శ్రీను,మాణిక్యారం సర్పంచ్ పూనెం స్వర్ణలత సంతోష్,పుబెల్లి సర్పంచ్ మెచ్చా సాయమ్మ ,సుభాష్ నగర్ సర్పంచ్ వల్లా మంగమ్మ,పోలారం ఉప సర్పంచ్ ధారవత్ చంద్రశేఖర్,నాయకులు కాకటి భార్గవ్,ధనుంజయ్,కల్తీ పద్మ,చెన్నూరి శ్రీనివాస్,చెన్నూరి క్రిష్ణ,ధారవత్ తారాచంద్, స్ధానిక కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గోన్నారు

## పది నెలల భవిష్య నిధి బకాయిలను కార్మికుల ఖాతాల్లో జమ చేయాలి

- జూన్ జూలై మాసాల వేతనాలు తక్షణమే అందించాలి
- కోయగూడెం గని కార్మికుల బకాయిలపై ఆందోళన...
- యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఇల్లందు ప్రధాన అధికారికి వినతి



**ఇల్లందు, ఆగస్టు 04,(మనం న్యూస్) :** కోయగూడెం గనిలో మట్టి తొలగింపు పనులు నిర్వహిస్తున్న సంస్థ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలతో పాటుపదినెలలుగా జమ చేయని ఉద్యోగుల భవిష్యనిధి బకాయిలను వెంటనే చెల్లించాలని సింగరేణి యాజమాన్యాన్ని కోరుతూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఇల్లందు ప్రధాన అధికారికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ రసుద్దీన్, రాష్ట్ర నాయకుడు డి. ప్రసాద్ మాట్లాడుతూ, కార్మికులకు జూన్, జూలై నెలల వేతనాలు ఇప్పటికీ అందక తీవ్ర ఇబ్బందులుఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకసార్లుయాజమాన్యానికివినతిపత్రాలు సమర్పించినా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదనిఆరోపించారు.ఉద్యోగుల జీతాల నుంచి భవిష్యనిధి పేరుతో కోత విధిస్తున్నప్పటికీ, ఆ మొత్తాలను సంబంధిత ఖాతాల్లో జమ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దీనిపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు.కార్మికుల శ్రమకు తగిన ప్రతిఫలం సమయానికి అందక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులుఎదుర్కొంటున్నాయని, పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలు, పది నెలల భవిష్యనిధి బకాయిలను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.సంబంధిత సంస్థపై సింగరేణి యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు తోడేటి నాగేశ్వరరావు, ప్రాంతీయ అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సంజయ్ నగర్ ప్రధాన రహదారిలో మట్టి కుప్పలు

- పాలక పక్షానికి కొమ్ముకాస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సెక్రటరీ



**- ఇల్లందు, ఆగస్టు 04 (మనం న్యూస్) :** ఇల్లందు పరిసర గ్రామపంచాయతీ రహదారి గుండా బాలాజీ నగర్ సంజయ్ నగర్ ఆజాద్ నగర్ కోరగుట్ట ప్రజలందరూ ఈ రహదారి గుండా మెయిన్ ప్రధాన రహదారికి గత 40, 50 సంవత్సరాలుగా వందలాది మంది వెళ్తూ ఉంటారు.అలాంటి ప్రధాన రహదారికి వెళ్లే సంజయ్ నగర్ దారిలో మట్టి కుప్పలు పెద్ద ఎత్తున పోసి ప్రయాణం చేసేందుకు వీలు లేకుండా పోవడం వలన చుట్టూ తిరిగి రావాల్సి వస్తుందని ఆటోలు ఎక్కువ చార్జీలు వసూలు చేస్తున్నారని బాలాజీ నగర్ గ్రామపంచాయతీకి మూడు వీధుల ప్రజలందరూ వచ్చి మట్టికుప్పలు ఎత్తివేయాలని ఆ మట్టి కుప్పలను లోయలో వెంటనే పూడ్చాలని కోరుతూ గ్రామపంచాయతీ పాలక మండలి సభ్యులను సెక్రెటరీ ని ప్రజలు నిలదీశారు. సెక్రెటరీ నుండి ఎటువంటి సమాధానం లేకపోవడం పాలక వర్గానికి తొత్తుగా వ్యవహరిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నాడు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వైస్ ఎంపీపీ అధ్యక్షులు దాస్యం ప్రమోద్ కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యులు, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు పులి సైదులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఇల్లందు మార్కెట్ చిరు వ్యాపారస్తులతో ఎమ్మెల్యే కనకయ్య సమావేశం...

- నూతన మార్కెట్‌లో చిరు వ్యాపారస్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే ఆరా....
- వ్యాపారస్తులందరి సామూహిక నిర్ణయం ప్రకారం కమిటి ఏర్పాటు చేసుకొని ఒకేటే ధర విధానం పాటించాలని ఎమ్మెల్యే సూచన...





**ఇల్లందు, ఆగస్టు 04 (మనం న్యూస్) :** ఇల్లందు నూతన మార్కెట్ లో వ్యాపారం కొనసాగిస్తున్న చిరు వ్యాపారులతో ఇల్లందు పురపాలక కార్యాలయం లో మంగళవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య, సమావేశం నిర్వహించారు...సమావేశంలో భాగంగా నూతన మార్కెట్ లో చిరువ్యాపారస్థులుఎదుర్కొంటున్నసమస్యలపైఆరాతీసారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం మాట్లాడుతూ.వ్యాపారస్థులందరు సమూహిక నిర్ణయం ప్రకారం కమిటి ఏర్పాటు చేసుకోని, ఒకటే ధర విధానం పాటించాలని ఎమ్మెల్యే , సూచించారు,చిరు వ్యాపారుల సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తామని తెలిపారు...రాష్ట ప్రభుత్వం కొట్ల రూపాయలు వెచ్చించి,చిరు వ్యాపారస్ధుల కోసం నూతన నిర్మాణాలు చెపట్టిందని ఈ సంధర్భంగా ఎమ్మెల్యే వ్యాపారస్ధులకు గుర్తు చేసారు..కొద్ధిరోజులలో మార్కెట్, చుట్టూషెడ్స్, నిర్మాణం చెపట్టనున్నామని, అప్పటి వరకు చిరు వ్యాపారస్ధులందరు ఐకమత్యంతో కొనసాగలని తెలిపారు.

ఈ సమావేశంలో ఇల్లందు పురపాలక చైర్మెన్ దొడ్డా,కిరణ్,మిత్రడానెయల్,ఇల్లందు పురపాలక కమిషనర్ సందీప్,ఇల్లందు టౌన్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు బోళ్ళ సూర్యం, కోఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తి, మాజీ టౌన్ అధ్యక్షులు దొడ్డా డానెయల్, చిరు వ్యాపారులు తదితరులు పాల్గోన్నారు..

**ఇల్లందు,ఆగస్టు 03 (మనం న్యూస్) :** ఇల్లందు లో నాలుగైదు రోజుల క్రితం పట్టణంలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో ఒక విద్యార్థిని సంబంధిత పాఠశాల యజమాని ప్రిన్సిపాల్ ఉపాధ్యాయురాలు ఇద్దరు తీవ్రంగా దండించినట్లు తెలిసింది. ఇద్దరు కలిసి దండించిన విషయాన్ని సదరు విద్యార్థి వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు పాఠశాల యజమానిని విద్యార్థిని దండించిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయురాలని తీవ్రంగా మందలించినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో కేసులు సైతం పెట్టేందుకు సిద్ధమవుతుండగా విద్యార్థి గ్రామానికి చెందిన ఓ పెద్దమనిషి మధ్యవర్తిత్వం వహించి సదర్ పాఠశాల యజమానిని,దండించిన ఉపాధ్యాయులను మందలించి వదిలేసినట్లు తెలుస్తుంది. ఈ విషయం పట్టణం,మండలంలో తీవ్ర చర్చనీ అంశంగా మారింది.



# తల్లిపాలే బిడ్డలకు తొలి రక్షణ పోషణ

## జిల్లా మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్ట్ అధికారిణి ఏ. ప్రమీల

## ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సభ

**కామేపల్లి ఆగస్టు 4 (మనం న్యూస్):** తల్లిపాలే బిడ్డలకు తొలి రక్షణ మరియు పౌష్టికాహారమని జిల్లా మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్టు అధికారిణి ఏ. ప్రమీల స్పష్టం చేశారు. ఐసిడిఎస్ కామేపల్లి ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండలంలోని పండితాపురం రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ?పుట్టిన ప్రతి బిడ్డకూ అమ్మ పాలు అమృతంతో సమానమని ప్రమీల తెలిపారు. ప్రసవించిన వెంటనే వచ్చే ముర్రు పాలు బిడ్డకు అందే మొదటి సహజ సిద్ధమైన పౌష్టికాహారమని, దాన్ని ప్రతి తల్లీ తప్పక బిడ్డకు అందించాలని కోరారు. బిడ్డ పుట్టిన క్షణం నుండి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని, దీనివల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి అనారోగ్య సమస్యల నుండి రక్షణ లభిస్తుందని వివరించారు. ఆరు నెలల వయస్సు దాటిన తర్వాత తగిన పోషకాహారాన్ని అందిస్తూనే, రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగించడం ద్వారా పిల్లలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఎదుగుతారని సూచించారు. తల్లిపాల వారోత్సవాలను కేవలం ఒక అధికారిక కార్యక్రమంగా మాత్రమే ముగించకుండా, గ్రామీణ ప్రాంత ప్రజల్లో పూర్తిస్థాయి చైతన్యం కలిగించేలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా తల్లులకు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతపై నిరంతరం అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ?ఈ కార్యక్రమంలో కామేపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ కే. ఉమా, మండల వైద్య అధికారిణి డాక్టర్ శ్రీదేవి, కొమ్మినేపల్లి సర్పంచ్ డి. అనురాధ, డీఎం కోఆర్డినేటర్ సమీన్‌లతో పాటు కామేపల్లి ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు టీ. విజయలక్ష్మి, పీ. లక్ష్మి, బి. వరలక్ష్మి, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి పువ్వాడ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

## పోలీసులకు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ యూత్ నాయకులు



**ఖమ్మం, ఆగస్ట్ 4 (మనం న్యూస్):** మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేస్తూ దూషిస్తే ఎవర్ని సహించేది లేదని ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మాటేటి కిరణ్ కుమార్ స్పష్టం చేశారు. మాజీ మంత్రి పువ్వాడపై అనుచిత పదజాలంతో విమర్శించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బోడేపూడి రాజాపై ఖనాపురం హవేలీ పోలీసులకు బీఆర్ఎస్ యువజన విభాగం ఖమ్మం నగర కార్యదర్శి మాటేటి కిరణ్ కుమార్ ఫిర్యాదు చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. స్థాయి మరిచి వ్యాఖ్యలు సబబు కాదని ఏమి మాట్లాడాలో తెలియక పెద్ద నాయకులను విమర్శిస్తే హీరో అయిపోతామని భ్రమలో మాట్లాడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఇటువంటి అనుచిత వ్యాఖ్యలు చేసి సమాజంలో జీరో కావడం తప్పితే ఎలాంటి ప్రయోజనం ఉండదని, బోడేపూడి రాజా వంచి వ్యక్తుల వలన ఆ కాంగ్రెస్ పార్టీకి నష్టం తప్పితే ప్రయోజనం ఏమీ ఉండదనే విషయాన్ని కాంగ్రెస్ అగ్రనేతలు గమనించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వలరాజు బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు మోరంపూడి సాయి కృష్ణ,విజేత, హుస్సేన్, సన్నే, మునాఫ్, వోటు పాల్గొన్నారు.

# ఘనంగా కళ్యాణ బంధం సమిష్టి మ్యారేజ్ బ్యూరోస్ 3వ వార్షికోత్సవం



**ఖమ్మం, ఆగస్ట్ 4 (మనం న్యూస్):** కళ్యాణ బంధం సమిష్టి మ్యారేజ్ బ్యూరోస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా 3వ వార్షికోత్సవం సర్వ సభ్య సమావేశం మారెమ్మ తల్లి గుడి వద్ద జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సమిష్టి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి వాసుదేవా రెడ్డి హాజరయ్యారు . ఈ సర్వసభ్య సమావేశం గోకినపల్లి వంశి , కొండ ముదిరాజ్ , మహిళా అధ్యక్షురాలు ఉమా , సాదినేని కరణ్ కుమార్, రామిశెట్టి నరేష్ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు . ఈ కార్యక్రమానికి మ్యారేజ్ బ్యూరో మీడియేటర్ కుటుంబ సభ్యులందరూ హాజరై వారి సమస్యల గురించి రాష్ట్ర కమిటీ సభ్యులకు వివరించారు. వారి ప్రతిపాదనను విని వారికి సలహాలు సూచనలు ఇచ్చారు. మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ వ్యవస్థను గవర్నమెంట్ గుర్తించి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశానికి 250 మంది మీడియేటర్స్ హాజరయ్యారు . నూతన సభ్యులు 50 మంది అసోసియేషన్ లో సభ్యత్వం తీసుకున్నారని పేర్కొన్నారు.

# ఎల్‌నినో వర్ష భావంతో నష్టపోయిన రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకోవాలి

## వ్యవసాయ కార్మికులకు 7500 రూపాయల కుటుంబానికి 20 కేజీల బియ్యం ఇవ్వాలని.

## గోదావరి జలాలు పాలేరు వెంటనే అందించాలి.

## ఏఐ యు కేఎస్, రాష్ట్ర నాయకుడు కమ్మ కోమటి నాగేశ్వరరావు.



**తిరుమలాయపాలెం ఆగస్టు 4 (మనం న్యూస్)** వర్షాభావంతో రాష్ట్రంలో, జిల్లాలో , మండలంలో నష్టపోయిన రైతాంగాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాల ఆదుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం, అఖిలభారత ప్రగతి వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీ ల పిలుపులో భాగంగా ఈరోజు తిరుమలాయపాలెం తాసిల్దార్ గారికి మంగళవారం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా (ఏఐయుకేఎస్) రాష్ట్ర నాయకులు కమ్మ కోమటి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్లో వర్షాలు సజావుగా సకాలంలో ఉంటాయన్న వాతావరణ నిపుణుల మాటలతో ప్రజలంతా వ్యవసాయ సాగుకు సిద్ధపడ్డారు విత్తనాలు వేశారు అక్కడక్కడ చిరుజల్లులు తప్ప భారీ వర్షాలు లేక రైతాంగమంతా తీవ్ర నష్టపోయింది ఏసిన పంటలు విత్తనాలు మొలకెత్తగా మొలకెత్తిన విత్తనాలు ఎండిపోయే దశలో తీవ్ర విషాదంలో రైతాంగం ఉన్నది. ఇట్టి పరిస్థితుల్లో వర్షాభావంతో నష్టపడ్డ రైతాంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి ముఖ్యంగా తిరిగి ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఉపయోగపడే స్వల్పకాలిక పంటలకు విత్తనాలు ,ఎరువులు ఉచితంగా సకాలంలో క్షేత్రస్థాయిలో అందించాలని డిమాండ్ చేస్తున్నాం. రైతుల రుణాలు పూర్తిగా రద్దుచేసి ఒకేసారి రుణమాఫీ చేయాలి కొత్తగా వడ్డీ లేని పంట రుణాలు ఇవ్వాలి పంటకు బీమా అమలు చేయాలి పశుగ్రాసం, రాబోవు రోజులలో మంచినీటి సరఫరా గ్రామాలకు సమకూర్చాలని ఎండిపోతున్న పంటలకు ప్రాజెక్టు లోపాలు సరిచేసి తక్షణమే గోదావరి జలాలు పాలేరుకు అందించాలని కోరుతున్నాం. రాష్ట్రంలో. జిల్లాలో. మండలంలో వర్షాభావ పరిస్థితి తీవ్ర ఆందోళన కలిగిస్తుంది ఎల్ ని నో వలన ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి ప్రాజెక్టులు కుంటలు చెరువులోకి నీరు చేరని పరిస్థితి ఉంది దీంతో సాగు పనులు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడ్డది ఇట్టి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతాంగాని అన్ని విధాల ఆదుకోవాలని అన్నారు. వ్యవసాయ కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని రోజుకు 600 రూపాయలు చెల్లించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. వ్యవసాయ కూలీలకు నెలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రకటించిన విధంగా 1000 జీవన భృతి మరియు కరువు బత్యం ప్రతి కుటుంబానికి 20 కేజీల బియ్యం .7500 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలను నాగేశ్వరరావు హెచ్చరించారు. ఈ లికార్యక్రమంలో ఏఐపీకే ఎంఎస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు. రాష్ట్ర నాయకులు రేపాకుల శివలింగం. పాలేరు డివిజన్ అధ్యక్షుడు సోమనపల్లి వెంకటేశ్వర్లు. అఖిలభారత ఐక్య రైతు సంఘం(ఏఐయుకేఎస్) పాలేరు డివిజన్ అధ్యక్షుడు బానోత్ శంకర్. మండల వెంకటేశ్వర్లు. ఆరంపల వెంకన్న. ఎన్నబోయిన శ్రీనివాసరావు. పోతుగంటి వెంకన్న. సిద్దయ్య. సహదేవ్. తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రగతికి 'కేంద్ర' హస్తం.. రూ.2,370 కోట్ల భారీ నజరానా!

## ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లకు తెలంగాణ ప్రజలు రుణపడి ఉంటారు

## మౌలిక రంగాలు, గ్రామీణాభివృద్ధికి సరికొత్త ఊపు

## రాష్ట్ర ప్రగతిలో కేంద్రానిదే అగ్రపాత్ర: బీజేపీ నేత స్పష్టీకరణ



**తిరుమలాయపాలెం ఆగస్టు 4 (మనం న్యూస్)** బిజెపి మండల ప్రధాన కార్యదర్శి (నల్లగట్టు శ్రీనివాస్) తెలంగాణ రాష్ట్ర ప్రగతి ప్రస్థానంలో కేంద్ర ప్రభుత్వం మరో కీలక మైలురాయిని అధిగమించింది. రాష్ట్ర సమగ్ర వికాసమే ధ్యేయంగా ఏకంగా రూ.2,370 కోట్ల భారీ ఆర్థిక సహాయాన్ని ప్రకటించి కేంద్రం తన ఉదారతను చాటుకుంది. మోదీ ప్రభుత్వానికి తెలంగాణ అభివృద్ధిపై ఉన్న నిబద్ధతకు ఈ నిధుల కేటాయింపే సజీవ సాక్ష్యమని తిరుమలాయపాలెం బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నల్లగట్టు శ్రీనివాస్ కొనియాడారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం పట్ల ఆయన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అభివృద్ధికి సరికొత్త హంగులు: ఈ సందర్భంగా నల్లగట్టు శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఉన్న ప్రత్యేక ప్రేమాభిమానాలకు ఈ ఆర్థిక ప్యాకేజీ నిదర్శనమన్నారు. "కేంద్ర ప్రభుత్వం కేవలం నిధులు ఇవ్వడమే కాదు.. రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. పక్షపాతాలు లేకుండా కేవలం ప్రజా సంక్షేమమే పరమావధిగా కేంద్ర ప్రభుత్వం నిరంతరం తెలంగాణకు అండగా నిలుస్తోందని, ఈ నిధులతో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోవడం ఖాయమని శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు.

# ఆగస్టు 10న జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

## సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను పిలుపు



**తిరుమలాయపాలెం ఆగస్టు 4 (మనం న్యూస్)** తిరుమలాయపాలెం మండలంలో సిపిఎం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం సీపీఎం పార్టీ పిండిప్రోలు గ్రామ సర్పంచ్ కామల్ల సువార్త అధ్యక్షతన నిర్వహించిన ఈ యొక్క సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను పాల్గొని ప్రసంగించారు శ్రీను మాట్లాడుతూ దేశంలో కార్మికులు కర్షకులు వ్యవసాయ కార్మికుల వ్యతిరేకంగా దేశంలో మోదీ ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయకుండా నాలుగు లేబర్ కోడులు తీసుకొచ్చి కార్మిక చట్టాలను కాలరాస్తుందని వాటిని రద్దు చేయాలని విద్యుత్ సవర్ణ రైతు వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని కార్మికులు రైతులు వ్యవసాయ కూలీల హక్కులను పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకంగా నిరసిస్తూ ఈ నెల 10 వ తారీఖున తిరుమలాయపాలెం మండల కేంద్రంలో జైల్ బరో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు యొక్క కార్యక్రమంలో రైతులు కూలీలు కార్మికులు పేదలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు యొక్క సందర్భంగా వాడవాడనా వీధి వీధిలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దొడ్డలింగస్వామి సర్పంచి కామల్ల సువార్త సర్పంచి ఆరేంపుల వినోద ఇస్లావత్ హుస్సేన్ నాయక్ కొమ్ము నాగేశ్వరరావు జాల ఉమేష్ గంటల రాము వెంకన్న మహేష్ ముత్తయ్య కామల్ల వీరభద్రం మధు సీపీఎం మండల నాయకులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు

# లోతట్టు ప్రాంతాలు జలమయం

**– వరద నీటితో స్తంభించిన రాకపోకలు**
**– శ్రీనివాస్ కాలనీ వద్ద నిలిచిన వరద నీరు**
**– కమిషనర్, డిప్యూటీ మేయర్ తక్షణ చర్యలు**

**పాల్వంచ, ఆగష్టు 4(మనం న్యూస్):** కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధి పాల్వంచ వ్యాప్తంగా పలు డివిజన్లు వర్షపు నీటిలో చిక్కుకున్నాయి. ఇండ్లలోకి నీరు చేరి, పలు కాలనీలు చిత్తడిగా మారాయి. దమ్మపేట సెంటర్ నుంచి ములకలపల్లి వెళ్లే ప్రధాన రహదారి వరద నీటితో స్తంభించింది. శ్రీనివాస కాలనీ సమీపంలోని శివాలయం వద్ద రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా రోడ్డుపై నీరు నిలిచి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాకపోకలకు అంతరాయం కలిగింది. సమస్యను గుర్తించిన వెంటనే కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ సుజాత, డిప్యూటీ మేయర్ లలితకుమారి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని తక్షణమే తొలగింపు చర్యలు చేపట్టారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. ప్రజల సమస్యపై వెంటనే స్పందించి పరిష్కారం చూపిన కమిషనర్ సుజాత, డిప్యూటీ మేయర్ లలితకుమారి లకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. తక్షణ చర్యలపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# ప్రజాసమస్యల పరిష్కారమే ఎజెండాగా కార్పొరేటర్లు పని చేయాలి

**– కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లతో సమావేశంలో కొత్వాల**

**పాల్వంచ, ఆగష్టు 4(మనం న్యూస్):** ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా గా కార్పొరేటర్లు తమ డివిజన్ అభివృద్ధికి కృషి చేయాలని డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో కొత్తగూడెం కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లతో సమావేశం జరిగింది. కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం జరగనుండగా, కార్పొరేటర్లు ఏ విధంగా సమస్యలపై స్పందించేలా చూడాలో చర్చించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. ప్రజలు తమ మీద ఎన్నో ఆశలతో కార్పొరేటర్లుగా ఎన్నుకున్నారని, వారి ఆశలను వమ్ము చేయకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితకుమారి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తిక్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి నూకల రంగారావు, అధికార ప్రతినిధి, రైల్వే బోర్డు మెంబర్ వై. శ్రీనివాసరెడ్డి, కార్పొరేటర్లు రావి రాంబాబు, దుంపల రాజేష్, సీరపు సుగుణ, వేగినాటి భవిత, హోళి శ్రీను, నూకల సరిత, బానోత్ బాలునాయక్, దంతె బోయిన నరేష్, డాక్టర్ స్వప్న, ఆకునూరి సుప్రియ, మహమూద్, కె.కె. శ్రీను, జల్లి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# టీజీ ఎస్ డబ్ల్యు ( మహిళ ) డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి పై అవగాహన

**– మొదటి సంవత్సర విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం**

**పాల్వంచ, ఆగష్టు 4(మనం న్యూస్):** తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల కొత్తగూడెంలో నూతనంగా చేరిన ప్రథమ సంవత్సరం విద్యార్థినుల కోసం మూడు రోజుల ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యా విధానం, క్రమశిక్షణ, విద్యార్థినులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు, ఉపాధి మార్గాలు, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వివిధ అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అంతర్గత మరియు సెమిస్టర్ పరీక్షల విధానం, గ్రంథాలయ వినియోగం, డిజిటల్ లెర్నింగ్, స్కాలర్‌షిప్‌లు, నైపుణ్యాభివృద్ధి కోర్సులు, కెరీర్ మార్గదర్శనం, ప్లేస్‌మెంట్ అవకాశాలు, యాంటీ ర్యాగింగ్ నిబంధనలు, మహిళల భద్రత, విద్యార్థినుల సంక్షేమ కార్యక్రమాలపై వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. బి ఝాన్సీ రాణి మాట్లాడుతూ.. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని



క్రమశిక్షణ, సమయపాలన, కృషితో విద్యను అభ్యసించాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, నూతన విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బోడేపూడి వర్ధంతి సభను జయప్రదం చేయండి

**– మడుపల్లి గోపాలరావు సిపిఎం డివిజన్ కార్యదర్శి.**

**మధిర,ఆగస్టు4(మనం న్యూస్):** మధిర మాజీ శాసనసభ్యులు అమరజీవి బోడిపూడి వెంకటేశ్వరరావు 29వ వర్ధంతి సభ మధిర పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్ నందు ఆగస్టు 5 2026 బుధవారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా ప్రముఖ రాజకీయ విశ్లేషకులు మాజీ శాసనమండలి సభ్యులు కె ఎస్ లక్ష్మణరావు ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించనున్నారు. సభ అధ్యక్షులుగా మడుపల్లి గోపాల్ రావు గారు వ్యవహరించనున్నారు. మధిర నియోజకవర్గ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన మన జీవి బోడిపుడి వెంకటేశ్వరరావు రాజకీయ చైతన్యం సేవా దృక్పథం కమ్యూనిస్టు జీవన విధానం నేటి యువతకు ఆదర్శప్రాయంగా ఉంటుందని ఈ సందర్భంగా మడుపల్లి గోపాలరావు అన్నారు. మధిర మరియు పరిసర ప్రాంత ప్రజలంతా పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు, మందా సైదులు, డివిజన్ నాయకులు పాపినేని రామ నర్సయ్య, పట్టణ కార్యదర్శి పడకంటి మురళి పాల్గొన్నారు.

# కలెక్టర్ దృష్టికి ఏజెన్సీ దళితుల సమస్యలు తీసుకపోయిన దళిత హక్కుల సంఘానికి ధన్యవాదాలు

**– ఇదేవిధంగా మిగతా పార్టీలు సంఘాలు స్పందించాలి**



**కొత్తగూడెం టౌన్ ఆగస్టు 4 (మనం న్యూస్) :** షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ మాట్లాడారు.కొత్తగూడెం సింగరేణి ఏరియా హాస్పిటల్ సెంటర్ నుండి మంగళవారం ప్రకటన విడుదల చేశారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమంలో ఏజెన్సీ ప్రాంత ఎస్సి కులాల (దళితుల) పక్షాన సిపిఐ పార్టీ అనుబంధ సంఘం దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఏజెన్సీ ప్రాంత ఎస్సీలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వాశీ జిల్లా కలెక్టర్ మరియు అధికారుల దృష్టికి ఒక అడుగు ముందేసి తీసుకుపోయినందుకు సిపిఐ పార్టీకి,దళిత నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. వెనుకబడ్డ ఏజెన్సీ ప్రాంతంలో అభివృద్ధిలో వెనుకబడి నిత్యం అసమానతలతో అల్లాడుతున్న ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు జరుగుతున్న అన్యాయాన్ని ఇప్పటివరకు పార్టీలు,సంఘాలు గుర్తించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.పార్టీలు,సంఘాల బలోపేతానికి ఏజెన్సీ ప్రాంత ఎస్సీలను పావులుగా వాడుకొని శ్రమదోపిడికి పాలుపడుతున్నారని ఆరోపించారు.ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు జరుగుతున్న అన్యాయం ఎస్సీ హోదా తొలగించి గిరిజనేతరులు (నాన్ ట్రైబ్స్) గా అభియోగం మోపి అపనింద వేసి అభివృద్ధిపై వివక్షత,అలచివేత ధోరణితో ప్రభుత్వాలు అవలంబిస్తున్న పార్టీలు,సంఘాలు మౌనం పాటిస్తున్నాయని అన్నారు. ఇప్పటికైనా పార్టీలు ప్రజాసంఘాలు ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు జరుగుతున్న అన్యాయంపై స్పందించి గొంతు ఎత్తాలని కోరారు.ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు, విద్యావంతులు, ముఖ్యంగా యువతి,యువకులు ఎస్సీ కులాలు స్వతంత్ర హక్కులు కోల్పోయి సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న జాతిని కాపాడుకోవడానికి ఐక్యంగా అందరూ ముందుకు రావాలని బొమ్మెర శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోద రమేష్,ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు చలిగంటి కొమరయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు శిలుముల గోపి కిరణ్, ఎనగంటి శ్రీను పాల్గొన్నారు.

# అధికారులను కలిసిన సింగరేణి ఏరియా జిఎం

**కొత్తగూడెం సింగరేణి, ఆగష్టు 4(మనం న్యూస్):** కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన సిహెచ్.వెంకట రమణ మంగళవారం జిల్లా ఉన్నతాధికారులను మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్తగూడెం డీఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ ని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ని, ఆర్‌డీవో డి.మధుని వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిసి అభివాదం చేశారు. ఈ సందర్భంగా సింగరేణి కొత్తగూడెం



ఏరియా అభివృద్ధి జిల్లా యంత్రాంగంతో సమన్వయం ప్రజా ప్రయోజన కార్యక్రమాలపై సంక్షిప్తంగా చర్చించారు. నూతన జనరల్ మేనేజర్‌కు జిల్లా ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులో పరస్పర సహకారంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

# కాంగ్రెస్ 'యూత్ డిక్లరేషన్' నిరుద్యోగుల పాలిట 'మరణ శాసనం

## బీఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి ధ్వజం




**ఖమ్మం, ఆగష్టు 4(మనం బ్యూరో):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నిరుద్యోగులను నమ్మిస్తూ, మోసం చేస్తోందని, ఎన్నికల ముందు వారు ప్రకటించిన 'యూత్ డిక్లరేషన్' నేడు నిరుద్యోగుల పాలిట మరణ శాసనంగా పరిణమించిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి విమర్శించారు. ఉద్యోగం రాక తీవ్ర మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గడ్డం వేణును రాకేశ్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. అనంతరం బిఆర్ఎస్ జిల్లా కార్యాలయం 'తెలంగాణ భవన్'లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగాలు రాకపోవడంతో తన పేదరికాన్ని జయించలేక, కుటుంబాన్ని కాపాడుకోలేక తీవ్ర నిరాశా నిస్పృహలతో గడ్డం వేణు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వేణు రాసిన మూడు పేజీల సూసైడ్ నోట్ కేవలం అతని ఒక్కడి ఆవేదన కాదని, తెలంగాణలోని లక్షలాది మంది నిరుద్యోగుల గుండెల్లో మండుతున్న ఆక్రోశమని స్పష్టం చేశారు. ప్రభుత్వం భయపడి ఆ సూసైడ్ నోట్లోని పుటలను బయటకు రాకుండా తొక్కుతోందని, చివరకు ప్రేమ వ్యవహారమని చిత్రించి తప్పుదోవ పట్టించే కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు, యూత్ డిక్లరేషన్ అంటూ ఊరూరా తిరిగి బాండ్ పేపర్లు పంచిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు ఆ హామీలను గాలికొదిలేశారని విమర్శించారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయి?, మెగా డిఎస్సీ జాడ ఏది?, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, జీవో 46 రద్దు హామీలు ఏమయ్యాయి? బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఫీజుల పేరిట విమర్శలు చేసిన కాంగ్రెస్ నాయకులు, నేడు కానిస్టేబుల్, ఎస్ఐ అప్లికేషన్లకు రూ. 1000 నుండి రూ. 1500 వరకు వసూలు చేస్తూ నిరుద్యోగుల రక్తాన్ని పిండుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి కమిషన్లు వచ్చే బిల్లులు, కాంట్రాక్టులపై ఉన్న శ్రద్ధ నిరుద్యోగులకు నోటిఫికేషన్లు ఇవ్వడంపై లేదని రాకేష్ రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్ర హౌసింగ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సొంత జిల్లాలోనే అత్యంత పేద కుటుంబానికి చెందిన వేణుకు కనీసం ఇల్లు కూడా మంజూరు కాలేదని, కేవలం సొంత పార్టీ వారికే ఇండ్లు ఇచ్చుకుంటున్నారని ఆరోపించారు. కష్టాల్లో ఉన్న వేణును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేరుగా ఫోన్లో పరామర్శించి, ధైర్యం చెప్పారని తెలిపారు. నిరుద్యోగులెవ్వరూ ధైర్యం కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడవద్దని, ఉద్యోగ కల్పన, జాబ్ క్యాలెండర్ సాధించే వరకు బీఆర్ఎస్ ముందుండి పోరాడుతుందని పేర్కొన్నారు. తక్షణమే స్పష్టమైన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశం లో నాయకులు గూడా సంజీవ్ రెడ్డి, బలుసు మురళీకృష్ణ, మద్దెల విజయ కుమార్, ఈదుల రాజేష్, షారూక్, జడల కళ్యాణ్, సాయిదీప్, సాయి ప్రసాద్, మరియు తదితరులు పాల్గొన్నారు.



# కరాటే ఛాంపియన్ షిప్‌లో శ్రీ చైతన్య విద్యార్థికి బంగారు పతకం

**ఖమ్మం, ఆగష్టు 4(మనం న్యూస్):** శ్రీ చైతన్య జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎం.శ్రీజ ఖమ్మంలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక కరాటే ఛాంపియన్షిప్లో సీనియర్ బ్లాక్ బెల్ట్ విభాగంలో దక్షిణ భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించి బంగారు పతకం సాధించింది. ఈ విజయానికి కరాటే మాస్టర్ రామకృష్ణ అందించిన నైపుణ్యమైన శిక్షణ, మార్గదర్శకత్వం ఎంతో దోహదపడిందని కళాశాల యాజమాన్యం పేర్కొంది. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య, ఏజీఎంలు సిహెచ్.ం బ్రహ్మం, జి.ప్రకాశ్ రావు, జి.గోపాల్ కృష్ణ, జోనల్ ప్రిన్సిపాల్ ఎం.రత్నాకర్, డీన్లు వంశీ కృష్ణ, డి.శ్రీనివాసరావు, జె.కృష్ణ, ప్రిన్సిపాల్ జోజి చాకో, జి. రవీందర్ విద్యార్థిని శ్రీజను ఘనంగా అభినందించారు. ఆమె కృషి, క్రమశిక్షణ, అంకితభావాన్ని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల యాజమాన్యం విద్యార్థులు విద్యతో పాటు క్రీడారంగంలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచేందుకు ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందని, వారి సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని ఈ సందర్భంగా పేర్కొంది.

# తీవ్రరూపం దాల్చుతున్న నిరుద్యోగం

## జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

## వేణు కుమార్‌ను పరామర్శించిన బీజేపీ నేతలు

**ఖమ్మం, ఆగస్టు 04(మనం న్యూస్):** రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు తీవ్రరూపం దాల్చుతోందని, ఉద్యోగాలు రాక, నోటిఫికేషన్లు లేక యువత తీవ్ర మానసిక వేదనకు గురవుతోందని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటిఫికేషన్లు రాకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వేణుకుమార్‌ను బిజెపి నేతలు మంగళవారం పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో చర్చించారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సరూర్నగర్ యూత్ డిక్లరేషన్లో ఇచ్చిన ప్రతి మాటను అమలు చేయాలన్నారు. వేణు కుమార్ ఎన్నో ఏళ్లుగా లైబ్రరీల్లో రాత్రింబవళ్లు కష్టపడి చదువుకుంటూ, సొంత డబ్బులు ఖర్చు చేసి కోచింగ్ తీసుకున్నాడని తెలిపారు. ఇంట్లో తల్లి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటం, సొంత ఇల్లు కూడా లేకపోవడం, కుటుంబ పరిస్థితి అత్యంత దయనీయంగా మారడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. వేణు కుమార్ రాసిన సూసైడ్ నోట్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అలాగే కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు చేరాలనేదే అతని ప్రధాన కోరిక అని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి 45 రోజుల గడువు విధిస్తున్నామని, ఆ లోపు స్పష్టమైన కార్యాచరణతో జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని స్పష్టం చేశారు. ఒకవేళ ప్రభుత్వం స్పందించకపోతే నిరుద్యోగ యువతను ఏకం చేసి, నిరాహార దీక్షలతో సహా బృహత్తర ప్రజాస్వామ్య ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, మేకల నాగేందర్, ఆర్.వి.ఎస్. యాదవ్, సాయిరాం, ప్రతాప్, అర్బన్ మండల అధ్యక్షులు వాకదాని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





# ట్రెజరీ అండ్ అకౌంట్స్ డిపార్ట్మెంట్ సర్వీస్ రూల్స్‌కు సహకరించిన ఏలూరికి కృతజ్ఞతలు

**ఖమ్మం, ఆగష్టు 4(మనం న్యూస్):** ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డిపార్ట్మెంట్‌లో దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సర్వీసెస్ రూల్స్ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుని పలుమార్లు కలిసి రిప్రజెంటేషన్ ఇచ్చి ఆమోదింప చేయడంలో,జీవో రావడంలో నిరంతరం కృషి గావించిన టిజిఓ రాష్ట్ర అధ్యక్షులు, టిజిఈజెఏసి రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి శ్యామ్‌ని టీజీవో ఖమ్మం జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు. ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీస్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ నాన్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉదయభాస్కర్, వారి కార్యవర్గ సభ్యులు కలిసి కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిపార్ట్మెంట్లో వివిధ కేటగిరీలలో ప్రమోషన్స్ ఇచ్చే విధంగా కృషి చేయాలని, అదే విధంగా ఫారిన్ సర్వీస్ పోస్టులలో ప్రమోషన్స్ వచ్చే విధంగా కృషి చేయాలని ఏలూరు శ్రీనివాసరావును కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, ఎన్వి కృష్ణారావు, ఏటిఓ ప్రసన్న కుమార్, మహబూబాబాద్ టీజీవో జిల్లా అధ్యక్షులు ఎస్.కె రఫీ, హజార్ షరీఫ్, అన్వర్ హుస్సేన్, జ్యోతిరావు, సదానందం, రాజగోపాల చారి, రవీంద్ర గౌడ్, శిరీష, లావణ్య, ఉదయ భాస్కర్, రాధా, బాలు, వినయ్, మహేష్, పర్వేజ్, ట్రెజరీ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ బాధ్యులు, నాన్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ బాధ్యులు, వివిధ జిల్లాల నుండి వచ్చిన సబ్ ట్రెజరీ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

## పేద మహిళకు తోపుడు బండి అందజేత




**భద్రాచలం,ఆగస్టు 4 (మనం న్యూస్):** లయన్స్ క్లబ్ లు జటాయువు, సంపతి మైధిలి ద్వారా తోపుడు బండిని విరాజ్ రామానాయుడు ఆర్థిక సహాయం తో పేద మహిళకు పి ఎం జె ఎఫ్ లయన్ యడవల్లి కృష్ణ అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు లయన్ మంగి లాల్, లయన్ డా.వేగి సూర్యనారాయణ, లయన్ డా గోళ్ళ భూపతి రావు, గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడు కృష్ణారెడ్డి,లయన్స్ మెంబెర్స్ హాజరైనారు.

## భద్రాచలంలో 20వ వార్డు బీఆర్ఎస్ పార్టీ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక




**భద్రాచలం,ఆగస్టు 4 (మనం న్యూస్):** ఈరోజు భద్రాచల బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో 20వ వార్డు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంలో భాగంగా 20వ వార్డు కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించడం జరిగింది.

**20వ వార్డు కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన వారు:**

ఎండి. ముంతాజ్ బేగం ,కన్వీనర్ ఎస్.కె. రహీమున్, కో కన్వీనర్ మణి,రత్నం,కుమారి,బషీరి,పవన్ కుమార్,ఉష,ఉషారాణి, బుజ్జి,లక్ష్మీ,జంజం దేవి లను నియమించడం జరిగింది .ఈ సందర్భంగా భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ మాజీ ఇంచార్జ్ మానే రామకృష్ణ మాట్లాడుతూ సమస్యల వలయంగా ఉన్న భద్రాచలం పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం ప్రశ్నించే గొంతుకగా ప్రతి వార్డు కన్వీనర్ పనిచేయాలి. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను పార్టీ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలి. భద్రాచలంలో బీఆర్ఎస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలి అని అన్నారు.

## ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు మండలాల వారీగా నిధులు కేటాయించాలి

### – ఏవీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సోందె మల్లుదొర



**దుమ్ముగూడెం ఆగస్టు 4 (మనం న్యూస్):** ఆగస్టు 9న ఆదివాసులు పండుగ ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా నిర్వహించడానికి భద్రాచలం ఐటిడిఏ నుండి మండలాల వారీగా నిధులు కేటాయించాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు సొంది. మల్లుదొర అధికారులకు సూచన చేశారు. మంగళవారం భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఆధ్వర్యంలో ఆదివాసి సంఘాలతో నిర్వహించి ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమం పై చర్చించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మల్లు దొర మాట్లాడుతూ ఆగస్టు 9న జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఐటిడిఏ పరిధిలోని అన్ని ఆదివాసి మండలాల్లో ఘనంగా నిర్వహించేందుకు మండలాల వారీగా ప్రత్యేక నిధులు కేటాయించాలని, ప్రతి ఆదివాసి గ్రామంలో అధికారికంగా ఈ వేడుకలను నిర్వహించేలా ఐటిడిఏ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఆదివాసుల గొప్ప సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా డోలు, సన్నాయి మోతలు, రేలా పాటలు, సంప్రదాయ నృత్యాలతో గ్రామస్థాయి నుంచి ప్రారంభమై భద్రాచలం ఐటిడిఏ కేంద్రం వరకు ఆదివాసుల ఐక్యతను చాటే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఆగస్టు 9న జరిగే సభల్లో ఆదివాసుల గట్టు--గోత్రాల ప్రాధాన్యం, కోయ భాష ఇతర ఆదివాసి భాషలకు ప్రాధాన్యత కల్పిస్తూ వక్తలు తమ ప్రసంగాల్లో స్థానిక భాషలను ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని కేవలం సమావేశంగా కాకుండా, ఆదివాసుల ఆత్మగౌరవం, చరిత్ర, సంస్కృతి, హక్కులను గుర్తు చేసుకునే మహోత్సవంగా ప్రతి ఆదివాసి భావించేలా అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ఆదివాసుల కోసం అమలులో ఉన్న చట్టాలు, హక్కులు, ప్రభుత్వ జీవోలు గురించి ప్రజలకు అధికారులు స్పష్టంగా వివరించి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో ఏవీఎస్పీ నాయకులు, వివిధ ఆదివాసి సంఘాల ప్రతినిధులు, ఐటిడిఏ అధికారులు పాల్గొన్నారు.

# 4 లేబర్ కోడ్స్ రద్దు కోసం పోరాడుదాం

**– సిఐటియు జిల్లా కోశాధికారి జి పద్మ**

**– క్విట్ ఇండియా స్ఫూర్తితో ఆగష్టు 10న దేశ వ్యాప్తంగా ఆందోళనలకు పిలుపు**







**దుమ్ముగూడెం ఆగష్టు 4 (మనం న్యూస్):** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై నాలుగు లేబర్ కోడ్లు రద్దు కోసం పోరాటం చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి జి పద్మ పిలుపునిచ్చారు .గురువారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో పర్ణశాల, ములకపాడు, నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులకు ఆగస్టు పదిన జరిగే జై భరో కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొంటున్నట్లు తెలియజేస్తూ వినతి పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా జి పద్మ మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వం పై స్వాతంత్ర్యం కోసం పోరాడుదాం లేదా చావుకైనా సిద్ధం కావాలని క్విట్ ఇండియా ఉద్యమం ఇచ్చిన పిలుపునందుకుని ప్రజలందరూ నిర్వహించిన పోరాటం వల్ల స్వాతంత్ర్యం సాధించుకున్నామని , క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పోరేట్ అనుకూల విదానాలపై కార్మికులు, ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు.ప్రజల ఓట్లతో గెలిచి ప్రజా సంపదను దోచుకుంటున్న మోడీ ప్రభుత్వం కార్పోరేట్ సంస్థల ప్రయోజనం కోసం 29 కార్మిక చట్టాలను మార్చి నాలుకోడులు విధించిందని . కార్మిక చట్టాలను మార్చడం వల్ల ఎనిమిది గంటల పని హక్కు,ఉద్యోగ భద్రత,కనీస వేతన చట్టం, సంఘం పెట్టుకునే హక్కులను హరిస్తుందని విమర్శించారు. కనీస వేతనం 26000 ఇవ్వాలని చట్టబద్ధ సౌకర్యాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షులు,కార్యదర్శి, కోశాధికారి నర్సు శిరోమ ణి భాగ్య సుజాత చిన్నక్క లక్ష్మి జానకి సరస్వతి, కమల సుభద్ర, రేణుకా తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 8న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు

### ఎనిమిదిన యువజన ప్రదర్శన – పోస్టర్ ఆవిష్కరణ




**ఖమ్మం, ఆగస్ట్ 4(మనం న్యూస్) :** అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభలు సెప్టెంబర్ ఎనిమిది –నుంచి 10వ తేదీ వరకు యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరి గుట్టలో జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన రాష్ట్ర మహాసభల పోస్టర్ను సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఏఐవైఎఫ్ జిల్లా బాధ్యులు కొండపర్తి గోవిందరావు లతో కలిసి ఏఐవైఎఫ్ నాయకులు మంగళవారం గిరిప్రసాద్ భవన్లో ఆవిష్కరించారు. ఎనిమిదిన యాదగిరి గుట్టలో యువజన ప్రదర్శన, బహిరంగ సభ ఉంటాయని బాధ్యులు తెలిపారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఏఐవైఎఫ్ నాయకులు మామిళ్ల శ్రీనాథ్, శ్రావణ్, చింతల రమేష్, రామకృష్ణ, ఉపేందర్ పాల్గొన్నారు. జిల్లా మహాసభలు కోదుమూరులో : అఖిల భారత యువజన సమాఖ్య ఖమ్మం జిల్లా 25వ మహాసభలు చింతకాని మండలం కోదుమూరులో ఆగస్టు 21న నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా ఇంచార్జి కొండపర్తి గోవిందరావు తెలిపారు. ఈ మహాసభల్లో దేశంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళన, అది సాధించిన ఫలితాలు, ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చాయని ఆయన తెలిపారు.

# సురక్ష కా తిరంగా – సైబర్ స్వతంత్ర తెలంగాణ‘ పోస్టర్ను ఆవిష్కరించిన ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 04 (మనంప్రతినిధి):** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆగస్టు–2026 స్వాతంత్ర్య మాసం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ‘సురక్ష కా తిరంగా – సైబర్ స్వతంత్ర తెలంగాణ‘ సైబర్ అవగాహన ప్రచార కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం నాడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఆగస్టు నెల పొడవునా సైబర్ నేరాల నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సైబర్ ఆధారిత ఆర్థిక నేరాలు, ముఖ్యంగా స్టాక్ ఇన్వెస్ట్మెంట్ మోసాలు, బిజినెస్ ఇన్వెస్ట్మెంట్ మోసాలు వంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సురక్ష కా తిరంగా‘ ప్రచార సందేశమైన ‘ఆగు – ఆలోచించు, నిజం నిర్ధారించు, సైబర్ భద్రత పెంచు‘ అనే మూడు అంశాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. జాతీయ సైబర్ జాగృక్తా దివస్ సందర్భంగా నేటి నుండి జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు మరియు సాధారణ ప్రజల భాగస్వామ్యంతో నెల పొడవునా సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్లైన్ కు కాల్ చేయాలని ప్రజలకు సూచించారు. ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉంటేనే సైబర్ అవగాహన కలిగిన, సైబర్ సురక్షితమైన, సైబర్ స్వతంత్ర తెలంగాణ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, సైబర్ సెల్ సీఐ జితేందర్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, సైబర్ సెల్ ఎస్ఐ జుబేదా బేగం సైబర్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.